


epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com

సంపుటి : 19 సంచిక : 95 | 21-06-2026 ఆదివారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | Published from Nalgonda, circulated throughout Telangana state | పేజీలు : 8 వెల : రూ.1.00

## ఓట్ల ప్రక్షాళన చేపట్టడమే సర్

# ప్రధాన ఉద్దేశం




ఓట్లు తొలగిస్తారన్న అపోహ సరికాదు

చనిపోయిన, అడ్రస్ మారిన వారి ఓట్లు మాత్రమే తొలగింపు

ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి స్పష్టీకరణ




తెలంగాణ రాష్ట్రంలో జూన్ 25 నుంచి సర్ పక్రియ ప్రారంభం అవుతుందని ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. జూన్ 15 నుంచి జూన్24 వరకు సన్నాహక పక్రియ జరుగుతుందని.. జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫాం అందజేసే పక్రియ కొనసాగుతుందని చెప్పారు. మిస్ అయిన వారికి ఫాం 6తో మరోమారు ఎన్యూమరేట్ ఫాం అందజేసే అవకాశం ఉందన్నారు. జులై 31న ఓటర్ల డ్రాఫ్ట్ జాబితా విడుదల చేస్తామని, జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నట్లు సీఈవో వెల్లడించారు.

వార్త 2లో




## ఖతార్ పాలకుల ఔదార్యం

ట్రంప్‌కు 747 జంబో జెట్ గిఫ్ట్

ఆవిష్కరించిన అమెరికా అధ్యక్షుడు

ఖతార్ పాలకులు తనకు గిఫ్ట్‌గా ఇచ్చిన 747 జంబో జెట్ విమానాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆవిష్కరించారు. ఇకనుంచి ట్రంప్ కొంతకాలం పాటు ఇందులోనే ప్రయాణాలు చేయనున్నారు. ఈ విమానాన్ని ఆయన 'ఎగిరే వైట్‌హౌస్'గా అభివర్ణించారు. జాయింట్ బేస్ ఆంద్రూస్‌లో శుక్రవారం ఈ విమానం ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఇది ప్రపంచంలోనే అత్యంత విలాసవంతమైన విమానం అని ట్రంప్ పేర్కొన్నారు.

2




## యోధ ప్రధాని బెంజిమెన్ నెతన్యాహు

ప్రశంసలు కురిపించిన యూఎస్ అధ్యక్షుడు ట్రంప్

లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైనిక చర్యల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మధ్య తీవ్ర విభేదాలు తలెత్తినట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో నెతన్యాహుపై ట్రంప్ ప్రశంసల జల్లు కురిపించారు.

2

## స్వల్పంగా పెరిగిన బంగారం ధరలు

హైదరాబాద్,

శనివారం బంగారం ధరలు పెరిగాయి. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై 220 రూపాయలు.. 22 క్యారెట్ల బంగారంపై 200 రూపాయలు.. 18 క్యారెట్ల బంగారంపై 170 రూపాయలు పెరిగింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం.. ఉదయం 10 గంటల ప్రాంతంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,46,080 రూపాయల వద్ద.. 22 క్యారెట్ల బంగారం ధర 1,33,900 రూపాయల వద్ద.. 18 క్యారెట్ల బంగారం ధర 1,09, 560 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది.

## సర్ ప్రక్రియలో అప్రమత్తం కావాలి

సర్‌పై అప్రమత్తంగా లేకపోతే అనేక రకాల సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సర్‌లో ఓట్ల తొలగింపు సమయంలో సక్రమంగా గుర్తించాలని అన్నారు. శనివారం ముఖ్య కార్యకర్తలతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఖమ్మం నియోజకవర్గంలో 3,02,800 ఓట్లు ఉంటే అందులో సగం ఓట్లు కూడా మ్యాపింగ్ కాలేదన్నారు.



2

## కవిత బొగ్గుబాయి బాటలో ఉద్రిక్తత

భూపాల్‌పల్లిలో అడ్డుకున్న పోలీసులు

జయశంకర్ భూపాలపల్లి,

టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత చేపట్టిన బొగ్గుబాయి బాట ఉద్రిక్తతలకు దారితీసింది. సింగరేణి కేటీకే-5 ఇంక్లైన్ గని వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సింగరేణి బాయిబాట కార్యక్రమంలో భాగంగా 'తెలంగాణ రక్షణ సేన' అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కేటీకే-5 ఇంక్లైన్ గనికి చేరుకున్నారు. అయితే గని లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన కవితను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు, టీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. కవితకు మద్దతుగా వచ్చిన నాయకులు మెయిన్ గేట్ ఎక్కేందుకు ప్రయత్నించడంతో అక్కడ ఉద్రిక్తత మరింత పెరిగింది. నిరసన మధ్య గేట్‌ను తొలగించడంతో కల్వకుంట్ల కవిత అనుచరులతో కలిసి గని ప్రాంగణంలోకి ప్రవేశించారు. ఈ ఘటనతో గని పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.






2

## బంగ్లాదేశ్‌లో మళ్లీ ఉద్రిక్తతలు



2

## బండి భగీరథ్‌కు తాత్కాలిక ఉపశమనం

:కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌కు న్యాయస్థానంలో ఉపశమనం లభించింది. ఓ యువతిపై లైంగిక దాడి కేసులో అరెస్టై చంచల్‌గూడ జైల్లో రిమాండ్‌లో ఉన్న భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేసింది.



## పీఎం కిసాన్ డబ్బులు విడుదల

రూ. 2,000 చొప్పన 18,880 కోట్లు జమ

హుగ్లీ జిల్లాలో విడుదల చేసిన ప్రధాని నరేంద్ర మోదీ

పీఎం కిసాన్ డబ్బులు విడుదలయ్యాయి. ప్రధాని మోదీ 23వ విడత నిధులను విడుదల చేశారు. ఈ విడత ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న 9.44 కోట్ల మందికి పైగా అర్హులైన రైతు కుటుంబాల ఖాతాల్లోకి రూ. 2,000 చొప్పున మొత్తం రూ. 18,880 కోట్లు నేరుగా జమయ్యాయి. రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్రం అమలు చేస్తున్న పీఎం-కిసాన్నిధులు విడుదలయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేశారు. 23వ విడత కింద ఒక్కో రైతు ఖాతాలో రూ.2 వేలు చొప్పున జమ అయ్యాయి.

వార్త 2లో

# ఓట్ల ప్రక్షాళన చేపట్టడమే సర్ ప్రధాన ఉద్దేశ్యం

## ఓట్లు తొలగిస్తారన్న అపోహ సరికాదు

## చనిపోయిన, అడ్రస్ మారిన వారి ఓట్లు మాత్రమే తొలగింపు

## ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి స్పష్టీకరణ

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

తెలంగాణ రాష్ట్రంలో జూన్ 25 నుంచి సర్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. జూన్ 15 నుంచి జూన్24 వరకు సన్నాహక ప్రక్రియ జరుగుతుందని.. జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫాం అందజేసే ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. మిస్ అయిన వారికి ఫాం 6తో మరోమారు ఎన్యూమరేట్ ఫాం అందజేసే అవకాశం ఉందన్నారు. జులై 31న ఓటర్ల డ్రాఫ్ట్ జాబితా విడుదల చేస్తామని, జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నట్లు సీఈవో వెల్లడించారు. ఓటరు జాబితాలో ప్రస్తుతం ఎక్కడ ఓటు ఉందో అదే అడ్రస్‌కు ఎన్యూమరేషన్ ఫాం వస్తుందని సీఈవో తెలిపారు. ఆ అడ్రస్‌లో ఓటరు లేకపోతే అతని ఓటు అక్కడ తొలగించబడుతుందన్నారు. ప్రస్తుతం ఉంటున్న అడ్రస్‌తో మళ్లీ ఓటరు ఫాం8తో ఓటును ఎన్‌రోల్‌మెంట్ చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. సర్ ప్రధాన ఉద్దేశం ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయడమని.. ఓటర్లను తొలగించడం కాదని స్పష్టం చేశారు. 24 ఏళ్లుగా ఇక్కడ ఓటర్ జాబితా ప్రక్షాళన జరగలేదన్నారు. ఈ మధ్య కాలంలో చాలా మంది మృతి చెంది ఉంటారని.. కొందరు వలస వెళ్లి ఉంటారని తెలిపారు. వాటన్నింటినీ సరి చేయడమే సర్ ఉద్దేశమని చెప్పారు. ఇందులో రాజకీయ ప్రేరేపితం ఏమీ ఉందన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రంలోని ప్రతీ పౌరునికి ఎన్యూమరేషన్ ఫాం ఇస్తారని తెలిపారు. కులం, మతంతో సంబంధం లేకుండా అందరికీ ఫాం ఇస్తారన్నారు. ఎన్యూమరేషన్‌లో ముస్లిం, హిందూ అనే వ్యత్యాసం ఉండదని చెప్పారు. ఒక వర్గం ఓట్లు తొలగిస్తారనే ఆందోళన అవసరం లేదని సీఈవో సుదర్శన్ రెడ్డి వెల్లడించారు.




## ఖతార్ పాలకుల ఔదార్యం

### ట్రంప్‌కు 747 జంబో జెట్ గిఫ్ట్

### ఆవిష్కరించిన అమెరికా అధ్యక్షుడు

వాషింగ్టన్, అక్షరకలం ప్రతినిధి

ఖతార్ పాలకులు తనకు గిఫ్ట్‌గా ఇచ్చిన 747 జంబో జెట్ విమానాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆవిష్కరించారు. ఇకనుంచి ట్రంప్ కొంతకాలం పాటు ఇందులోనే ప్రయాణాలు చేయనున్నారు. ఈ విమానాన్ని ఆయన 'ఎగిరే వైట్‌హౌస్'గా అభివర్ణించారు. జాయింట్ బేస్ ఆండ్రూస్‌లో శుక్రవారం ఈ విమానం ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఇది ప్రపంచంలోనే అత్యంత విలాసవంతమైన విమానం అని ట్రంప్ పేర్కొన్నారు. ఇందులోని ఇంటీరియర్ డిజైన్, ఇంజిన్ల నాణ్యత అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. ఇది ఎయిర్‌ఫోర్స్ వన్ కంటే వేగంగా.. ఎక్కువ దూరం ప్రయాణిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఖతార్ పాలకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జులై 4న జరగనున్న అమెరికా 250వ స్వాతంత్య్ర వేడుకల్లో నిర్వహించే విమానాల ప్రదర్శనల్లో ఈ విమానం కూడా పాల్గొనే అవకాశం ఉందని ట్రంప్ వెల్లడించారు. కాగా.. విమానం లోపల లెదర్ సీట్లు, గోల్డ్ షేడ్స్‌తో కూడిన లేత గోధుమ రంగు గోడలు ఉన్నట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇప్పటివరకు 747- 200బి ఎయిర్‌ఫోర్స్ వన్ హోదాలో అమెరికా అధ్యక్షుడికి అధికారిక విమానంగా ఇది వ్యవహరించింది. జార్జ్ హెచ్‌డబ్ల్యూ బుష్ నుంచి ట్రంప్ వరకు ప్రతి అధ్యక్షుడికి ఈ పాత విమానమే సేవలందించింది. అధునాతన విమానం కాకపోయినా సౌకర్యవంతంగా ఉండేదని అమెరికా ప్రొటోకాల్ చీఫ్ మోనికా క్రౌలీ తెలిపారు. ప్రస్తుతం దీని ప్రస్థానం ముగిసింది. యూఎస్ వైమానిక దళం ఆర్డర్ చేసిన రెండు కొత్త బోయింగ్-747 విమానాలు అందేవరకు.. ఖతార్ నుంచి గిఫ్ట్‌గా వచ్చిన ఈ విమానాన్నే ట్రంప్ ప్రయాణాలకు వినియోగించనున్నారు.

## యోధ ప్రధాని బెంజిమెన్ నెతన్యాహు

### ప్రశంసలు కురిపించిన యూఎస్ అధ్యక్షుడు ట్రంప్

వాషింగ్టన్, అక్షరకలం ప్రతినిధి

లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైనిక చర్యల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మధ్య తీవ్ర విభేదాలు తలెత్తినట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో నెతన్యాహుపై ట్రంప్ ప్రశంసల జల్లు కురిపించారు. ఆయన్ను యోధ ప్రధానమంత్రిగా అభివర్ణించారు. వాషింగ్టన్ సమీపంలో ఖతార్ కానుకగా ఇచ్చిన నూతన ఎయిర్‌ఫోర్స్ వన్ విమాన ఆవిష్కరణ అనంతరం ట్రంప్ మాట్లాడారు. ఫిబ్రవరి 28న ఇరాన్‌తో యుద్ధం ప్రారంభమైన విషయాన్ని ప్రస్తావిస్తూ.. అమెరికా, ఇజ్రాయెల్‌ల మధ్య చక్కటి పోరాటం జరిగిందన్నారు. 'నిస్సందేహంగా మేం ఇజ్రాయెల్‌తో చాలా బాగా పోరాడాం. ఆ దేశంతో మాకు గొప్ప సంబంధాలున్నాయి. మేము చాలా శక్తిమంతంగా ఉన్నాం. ఇక బీబీ(నెతన్యాహు).. ఓ యోధుడి లాంటి ప్రధానమంత్రి. ఆయన్ను అలాగే గుర్తించాలి. ఆ ఘనత ఆయనకు దక్కాల్సిందే' అని ట్రంప్ పేర్కొన్నారు. లెబనాన్‌లో ఇజ్రాయెల్ యుద్ధాన్ని కొనసాగించాలని ఆ దేశ ప్రధాని తీవ్ర రాజకీయ ఒత్తిడిని ఎదుర్కొంటున్న తరుణంలో ట్రంప్ ఈ రకంగా వ్యాఖ్యానించడం గమనార్హం. ఇక.. లెబనాన్ ప్రాంతంలో ఇజ్రాయెల్ సైనిక చర్యలను, ముఖ్యంగా లెబనాన్‌పై జరగబోయే దాడుల విషయమై ట్రంప్ ప్రస్తావిస్తూ.. అలాంటి నిర్ణయాలపై నియంత్రణ అవసరమన్నారు. యుద్ధాన్ని ముగించేందుకు టెహ్రాన్‌తో ఒప్పందం కుదిరినప్పటికీ.. లెబనాన్‌లో ఇరాన్ మద్దతుగల హెజ్‌బొల్లాపై ఇజ్రాయెల్ సాగిస్తున్న పోరాటం పట్ల ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల ఓ సంభాషణలోనూ ఆయన నెతన్యాహునుద్దేశించి.. 'నీవు పిచ్చివాడివి. నేను లేకపోతే నువ్వు జైల్లో ఉండేవాడివి. నేనే నిన్ను కాపాడుతున్నాను' అని మాట తూలిన సంగతి తెలిసిందే. కాగా.. ఇరాన్‌తో కుదిరిన శాంతి ఒప్పందాన్ని నెతన్యాహు నిర్వీర్యం చేసే అవకాశముందని అమెరికా నిఘా సంస్థలు ట్రంప్ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నట్టు ది వాషింగ్టన్ పోస్ట్ ప్రచురించింది. ఆ నివేదిక ప్రకారం.. హెజ్‌బొల్లాపై ఇజ్రాయెల్ సైనిక చర్యలను కొనసాగించేందుకు సిద్ధంగా ఉందని తెలుస్తోంది. ఈ ఏడాది చివర్లో ఇజ్రాయెల్‌లో జాతీయ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో లెబనాన్ నుంచి సైన్యాన్ని ఉపసంహరించుకో బోనని, హెజ్‌బొల్లాతో పోరాటాన్ని తీవ్రతరం చేయాలనే తన సంకల్పాన్ని దేశ ప్రజలకు చూపించడంపైనే నెతన్యాహు రాజకీయ మనుగడ ఆధారపడి ఉందని స్థానిక మీడియా సంస్థలు ఉటంకించాయి.

## సర్ ప్రక్రియలో అప్రమత్తం కావాలి

### ఓట్లు తొలగిపోకుండా జాగ్రత్త పడాలి

### కార్యకర్తలకు మంత్రి తుమ్మల హితవు

ఖమ్మం, అక్షరకలం ప్రతినిధి

సర్‌పై అప్రమత్తంగా లేకపోతే అనేక రకాల సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సర్‌లో ఓట్ల తొలగింపు సమయంలో సక్రమంగా గుర్తించాలని అన్నారు. శనివారం ముఖ్య కార్యకర్తలతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఖమ్మం నియోజకవర్గంలో 3,02,800 ఓట్లు ఉంటే అందులో సగం ఓట్లు కూడా మ్యాపింగ్ కాలేదన్నారు. లక్షన్నరకు పైగా ఓట్లు పోయే పరిస్థితి కనపడుతోందన్నారు. ఇప్పటికైనా అప్రమత్తం కావాలని.. ప్రతి ఒక్క ఓటుని కాపాడుకోవాలన్నారు. ఓట్లను కాపాడుకోలేకపోతే భవిష్యత్తు రాజకీయం లేదని వ్యాఖ్యానించారు. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మూడు శాతం ఓట్ల తేడాతోనే గెలవడం జరిగిందని మంత్రి తెలిపారు. సర్ కార్యక్రమంలో 55 శాతానికి పైగా ఓట్లు కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. అప్రమత్తంగా లేకపోతే తీవ్రంగా నష్టపోతామని అన్నారు. మమతా బెనర్జీ, స్టాలిన్ ఓడిపోవడానికి కారణాలు, పరిస్థితిలు గుర్తు చేసుకోవాలని నాయకులకు సూచించారు. రాజకీయాల్లో ఉండాలనుకునే వారికి జీవన్మరణ సమస్య తప్పదన్నారు. బీజేపీ కావాలని ఓట్లను తొలగిస్తోందని, మరో పార్టీ మరోలా చేస్తోందని రకరకాల ప్రచారాలు వస్తున్నాయన్నారు. ఈ క్లిష్ట పరిస్థితులలో అప్రమత్తంగా లేకపోతే నష్టపోతామని తెలిపారు. అధికారులకు సహకరించాలని, వారితో కలిసి సమన్వయం చేసుకొని ఓట్లను కాపాడుకోవాలని నేతలకు మంత్రి తుమ్మల నాగేశ్వరావు సూచించారు.

## బంగ్లాదేశ్‌లో మళ్లీ ఉద్రిక్తతలు

### శ్రీరాముడి చిత్రంపై చెప్పు

### నిరసనగా ఢాకాలో హిందువుల భారీ ర్యాలీ

ఢాకా,

బంగ్లాదేశ్‌లో మళ్లీ ఉద్రిక్తతలు చెలరేగాయి. శ్రీరాముడి చిత్రంపై చెప్పు ఉంచి తమ మతవిశ్వాసాలను అవమానించారంటూ రాజధాని ఢాకాలో హిందువులు కాగడాలు, కొవ్వొత్తులతో శుక్రవారం రాత్రి భారీ ర్యాలీ నిర్వహించారు. జై శ్రీరామ్ అంటూ పెద్ద ఎత్తున నినదించారు. ఉత్తర గాయిబంద జిల్లాలో శ్రీశ్రీ రాధాగోవింద దేవాలయ కమిటీ 81 అడుగుల శ్రీరాముడి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు రంగంలోకి దిగింది. అయితే, అతివాదుల నుంచి బెదిరింపులు రావడంతో కార్యక్రమం వాయిదా పడింది. ఈ నేపథ్యంలో తాజాగా కొందరు అవమానకర చర్యలకు దిగడంతో పరిస్థితి మరోసారి ఉద్రిక్తంగా మారినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ క్రమంలో ఢాకాలో వేల మంది హిందువులు నిరసనకు దిగారు. పలు హిందూ సంఘాల ఆధ్వర్యంలో జై శ్రీరామ్ అని నినదిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి తరలి రావాలన్న హిందూ మహాజ్యోత్ సంస్థ పిలుపు మేరకు శుక్రవారం సామాన్య ప్రజలు, ఇతర హిందూ సంఘాలు షహబాగ్ కూడలికి పెద్ద సంఖ్యలో వచ్చారు. అక్కడి నుంచి నేషనల్ ప్రెస్ క్లబ్ వరకూ ర్యాలీగా వెళ్లారు. ప్రెస్‌క్లబ్ ముందు భారీ మానవహారంతో నిరసన తెలిపారు. మరికొంత మంది ఢాకా రిపోర్టర్స్ యూనిటీ భవనం ముందు నిరసన చేపట్టారు. రంగపూర్‌లో నిరసన తెలిపిన వారిని పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఉద్రిక్తతలు పెరిగాయి. మైనారిటీలు ఇన్ని ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం మౌనంగా ఉంటోందని నిరసనకారులు ఆరోపించారు. తమ మతవిశ్వాసాలను అవమానించిన వారిని 72 గంటల్లోగా అరెస్టు చేయాలని అల్టిమేటమ్ జారీ చేశారు. లేని పక్షంలో నిరసనలు మరింత తీవ్రమవుతాయని హెచ్చరించారు.

## బండి భగీరథ్‌కు తాత్కాలిక ఉపశమనం

### వారం పాటు బెయిల్ మంజూరు చేసిన కోర్టు

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

:కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌కు న్యాయస్థానంలో ఉపశమనం లభించింది. ఓ యువతిపై లైంగిక దాడి కేసులో అరెస్టై చంచల్‌గూడ జైల్లో రిమాండ్‌లో ఉన్న భగీరథ్‌కు మల్కాజ్‌గిరి కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో గత కొన్ని రోజులుగా భగీరథ్ జైలు జీవితం అనుభవిస్తున్నాడు. తాజాగా ఇంజనీరింగ్ పరీక్షల నేపథ్యంలో న్యాయవాదులు మధ్యంతర బెయిల్ కోరారు. వాదనల విన్న కోర్టు నెల 26 వరకు మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఇదిలా ఉండగా.. గత నెలలో భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదైన విషయం తెలిసిందే. దీంతో అతడిని వెంటనే అరెస్ట్ చేయాలంటూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. కొన్ని రోజులుగా అజ్ఞాతంలో ఉన్న భగీరథ్ మే 17న ఎట్టకేలకు పోలీసులకు లొంగిపోయాడు. ఇక, నిందితుడిని పేట్‌బషీరాబాద్ పోలీసులు గతంలో న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. మేడ్చల్ మేజిస్ట్రేట్ అతడికి 14 రోజుల రిమాండ్ విధించారు. అనంతరం చర్లపల్లి జైలుకు తరలించారు. అంతకుముందు రెండు గంటలకుపైగా సిట్ అధికారులు అతడిని విచారించారు. అప్పటి నుంచి నెల రోజులకు పైగా జైలు జీవితం గడిపిన భగీరథ్ తాజాగా బెయిల్‌పై బయటకు రానున్నాడు.

## ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు కీలక బాధ్యతలు

### ఎఫ్ఏటీఎఫ్‌కు వైస్‌ప్రెసిడెంట్‌గా మధ్యప్రదేశ్ ఐఏఎస్

న్యూఢిల్లీ,

ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు తాజాగా కీలక బాధ్యతలు లభించాయి. టెర్రరిస్టుల ఆర్థికమూలాలు, అక్రమ నగదు రవాణా నెట్వర్క్‌లను దెబ్బతీసేందుకు ఏర్పాటు చేసిన ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్)కు వైస్‌ప్రెసిడెంట్‌గా మధ్యప్రదేశ్ కేడర్ ఐఏఎస్ అధికారి వివేక్ అగర్వాల్ ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఉగ్రవాదులకు నిధులు అందకుండా అంతర్జాతీయంగా చేపడుతున్న చర్యల్లో భారత్‌కు పెరుగుతున్న ప్రాధాన్యానికి ఇది నిదర్శనమని రణధీర్ జైస్వాల్ చెప్పారు. ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు ఇది ఒక భారీ విజయమని వ్యాఖ్యానించారు. ఎఫ్ఏటీఎఫ్‌లో ఒక భారత అధికారికి ఇంతటి కీలక బాధ్యతలు దక్కడం ఇదే తొలిసారి. ఐఏఎస్ అధికారి వివేక్ అగర్వాల్ ప్రస్తుతం కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సెక్రటరీగా ఉన్నారు. అంతకుముందే, కేంద్ర ప్రభుత్వంతో పాటు పంజాబ్, మధ్యప్రదేశ్‌లో వివిధ స్థాయిల్లో పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. మధ్యప్రదేశ్ కేడర్‌లో చీఫ్ సెక్రటరీ గ్రేడ్ అధికారిగా 2025లో పదోన్నతి సాధించారు. గతంలో ఆయన రెవెన్యూ శాఖ అడిషనల్ సెక్రటరీగా ఉన్నారు. ÷నాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ డైరెక్టర్‌గా కూడా సేవలందించారు. పరిపాలన, ఆర్థిక అంశాల నిర్వహణలో విశేష గుర్తింపు పొందారు. పంజాబ్ యూనివర్సిటీ నుంచి బీకామ్, ఎల్ఎల్‌బీ చేసిన ఆయన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీస్ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా నుంచి సీఎస్(ఇంటర్) కూడా చేశారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌లో అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలకు సంబంధించి ప్రత్యేక కోర్సు కూడా చేశారు.

## ప్రియుడి మోజులో రెండేళ్ల కొడుకు హత్య

### ఫిట్స్‌తో చనిపోయాడని భర్తను నమ్మించిన భార్య

### అనుమానంతో పోలీసులకు ఫిర్యాదుతో బయటపడ్డ బండారం

సిద్దిపేట, అక్షరకలం ప్రతినిధి

సిద్దిపేట జిల్లాలో దారుణం జరిగింది. ప్రియుడితో ఏకాంతంగా గడిపేందుకు అడ్డొస్తున్నాడని రెండేళ్ల కొడుకునే ఓ కన్నతల్లి హత్యచేసింది. ఫిట్స్ వచ్చి చనిపోయాడని అందర్నీ నమ్మించింది. కానీ తండ్రికి అనుమానం రావడంతో 20 రోజుల తర్వాత ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం తీగుల్ గ్రామానికి చెందిన స్వామి క్యాబ్ డ్రైవర్. భార్య జ్యోతి, రెండేళ్ల కుమారుడు హరికృష్ణతో కలిసి కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తున్నాడు. ఈ క్రమంలో జ్యోతి నవీన్ అనే వ్యక్తితో అక్రర సంబంధం పెట్టుకుంది. భర్త లేని సమయంలో ప్రియుడిని ఇంటికి పిలుచుకునేది. ఇలా వాళ్లిద్దరూ ఏకాంతంగా ఉన్న సమయంలో బాబు తరచూ ఏడుస్తుండటంతో నవీన్ చిరాకు పడ్డాడు. ఈ క్రమంలోనే నీ కొడుకు నాకు నచ్చలేదు.. వాడిని చంపేద్దామని జ్యోతితో చెప్పాడు. అందుకు జ్యోతి కూడా ఓకే చెప్పింది. దీంతో ఇద్దరూ కలిసి ఏడుస్తున్న బాబును.. క్రూరంగా నేలకేసి కొట్టి చంపారు. బాబు చనిపోయిన తర్వాత నాటకమాడిన జ్యోతి.. భర్త స్వామి ఇంటికి రాగానే అకస్మా?త్తుగా ఫిట్స్ వచ్చి బాబు చనిపోయాడని ఏడ్చింది. భార్య మాటలు నమ్మిన స్వామి.. నిజమేనని భావించి.. అదే రోజు రాత్రి మృతదేహాన్ని స్వగ్రామమైన తీగుల్ తీసుకెళ్లి ఖననం చేశాడు. కానీ కొద్దిరోజుల తర్వాత భార్య ప్రవర్తనలో తేడా రావడంతో స్వామికి అనుమానం మొదలైంది. పైగా ఇంట్లో రక్తపు మరకలు కనబడటంతో అది కాస్త బలపడింది. దీంతో తన కొడుకు మృతిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారించగా.. జ్యోతి నేరం అంగీకరించింది. ఈ ఘటనలో జ్యోతిని పోలీసులు అరెస్టు చేయగా.. నవీన్ పరారీలో ఉన్నాడు.

## అన్నివర్గాలను మోసం చేసిన కాంగ్రెస్

### రైతులకు నరకం చూపిస్తున్న రేవంత్ ప్రభుత్వం

### కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద విమర్శలు

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద తీవ్రంగా మండిపడ్డారు. ప్రజలను నానాయాతన పెడుతూ రాష్ట్రాన్ని పూర్తిగా అధోగతి పాలు చేస్తుందని విమర్శించారు. హైదరాబాద్ చింతల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఉదయం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేపీ వివేకానంద మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ది పేరుకే ప్రజాపాలన.. వాస్తవానికి ప్రజలను హింసించే పాలనగా సాగుతుందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాక్షస పాలన సాగుతోందని ఆరోపించారు.పదేళ్ల పాటు కేసీఆర్ పాలనలో వ్యవసాయాన్ని ఒక పండుగలా మార్చారని కేపీ వివేకానంద తెలిపారు. రైతులను కంటికి రెప్పలా కాపాడుకుంటూ, కడుపులో పెట్టుకుని చూసుకున్నారని కొనియాడారు. సకాలంలో విత్తనాలు, యూరియా అందించడమే కాకుండా, సమయానికి 'రైతు బంధు' డబ్బులను నేరుగా రైతుల ఖాతాల్లో వేసి, పండించిన ప్రతి ధాన్యాన్ని కొనుగోలు చేసి అన్నదాతకు బంగారు బాట వేశారని పేర్కొన్నారు. కానీ నేడు రేవంత్ రెడ్డి రాక్షస పరిపాలనలో రైతులంతా హింసను అనుభవిస్తున్నారని, రైతులకు నరకం చూపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయానికి విత్తనాలు లేవు, యూరియా కోసం రైతులు రోడ్లపై పడిగాపులు కాస్తూ యుద్ధాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు పేరు మార్చి రైతు భరోసా అని పెట్టారని.. కానీ అది భరోసా కాదు.. రైతు మోసం అని అన్నారు. రైతు భరోసా కింద ఒక్క రైతుకు కూడా డబ్బులు ఇవ్వలేదని విమర్శించారు. సంపూర్ణ రుణమాఫీ చేస్తానని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని కేపీ వివేకానంద మండిపడ్డారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బోరంపేట పీఏసీఎస్ పరిధిలో 632 మంది రైతులకు కేవలం 13 మందికే రుణమాఫీ అయ్యిందని తెలిపారు. రుణమాఫీ విషయంలో రేవంత్ రెడ్డి గజదొంగలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం వడ్లు కొనకపోతే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయదా అని పీసీసీ ప్రెసిడెంట్‌గా ఉన్న సమయంలో రేవంత్ రెడ్డి ప్రశ్నించారని గుర్తుచేశారు. కేంద్రం వడ్లు కొనుగోలు చేయకపోతే కిషన్ రెడ్డి ఇంటి ముందు వడ్లు పోస్తానని శపథం చేసిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు మోదీకి సరెండర్ అయిపోయాడని విమర్శించారు. రేవంత్ రెడ్డి చేతగానితనాన్ని, డొల్లతనాన్ని, అసమర్థను ఆయన ప్రకటనలే బయటపెడుతున్నాయని అన్నారు. మూసీ ప్రక్షాళన, మెట్రో రైలు విస్తరణ, ఫోర్త్ సిటీ, కాళేశ్వరం రిపేర్లు ఇలా ప్రతిదాంట్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని అన్నారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై దుమ్మెత్తిపోస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ మోసాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని.. ఈ చేతగాని ప్రభుత్వాన్ని గద్దె దించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గులాబీ జెండా ఎగురడం, మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రైతాంగానికి చేసిన మోసానికి కాంగ్రెస్ ప్రభుత్వం ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తక్షణమే రైతు బీమా ప్రీమియం చెల్లించాలని, రైతు భరోసా కింద ఎకరానికి రూ. 15వేలను రైతుల ఖాతాలో జమ చేయాలలన్నారు. లేదంటే అసెంబ్లీ వేదికగానే కాకుండా, రోడ్లపైకి వచ్చి ప్రజా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి సర్కార్ మెడలు వంచైనా రైతుల హక్కులను సాధించుకుంటామని స్పష్టం చేశారు.

## కట్లపాములతో చెలగాటం

### ప్రాణం కోల్పోయిన యువకుడు

హైదరాబాద్,

పాముతో చెలగాటం ఓ వ్యక్తి ప్రాణం తీసింది. స్నేహితులను భయపెట్టాలని ఆ వ్యక్తి చేసిన పిచ్చి పని అతని ప్రాణాలను బలితీసుకుంది. ఫామ్‌హౌస్‌లో కనిపించిన కట్లపాము పిల్లను చేతిలో తీసుకుని పరచకాలు ఆడటంతో.. అది కాటువేసింది. దీంతో అతను ప్రాణాలు కోల్పోయాడు. హైదరాబాద్‌లోని మొయినాబాద్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కు చెందిన నవాబ్ జయ్యద్ ఖుమైద్ మొహిద్దీన్ (30) ఒక వ్యాపారవేత్త. తన స్నేహితులతో కలిసి ఇటీవల మొయినాబాద్‌లోని ఒక ఫామ్‌హౌస్‌కు వెళ్లాడు. వారితో సరదాగా గడుపుతున్న సమయంలో అక్కడకు ఒక కట్లపాము పిల్ల వచ్చింది. దాన్ని చూడగానే నవాబ్ దాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు. ఆ పాముతో తన స్నేహితును భయపెట్టాలని అనుకున్నాడు. ఆ కట్ల పాముతో ఆటలు ఆడుతూ స్నేహితులను భయపెట్టబోయాడు. కానీ ఇంతలో కుడి చేతి బొటనవేలుపై కాటేసింది. చిన్న పాము కదా.. పెద్దగా ప్రమాదం ఉండదని వాట్ లైట్ తీసుకున్నాడు. స్నేహితుల ముందు నవ్వుకుంటూ.. తనకు ఎలాంటి ఇబ్బంది లేదని, చికిత్స అవసరం లేదని స్నేహితులతో చెప్పుకొచ్చాడు. కానీ చిన్నదైనా, పెద్దదైనా కట్లపాము విషం అత్యంత ప్రమాదకరమేని అతను తెలుసుకోలేకపోయాడు. ఇంకేముంది.. కొద్దిసేపట్లోనే కట్ల పాము విషం నవాబ్ శరీరంపై ప్రభావం చూపడం మొదలుపెట్టింది. ముందుగా శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారింది. క్రమంగా ఆరోగ్యం కూడా క్షీణించింది. దీంతో ఆందోళన చెందిన స్నేహితులు నవాబ్‌ను వెంటనే ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అప్పటికే విషం శరీరం మొత్తం పాకడంతో నవాబ్ కన్నుమూశాడు. కాగా, దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది.

# సింగరేణి ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు



**మందమర్రి, జూన్ 20 అక్షర కలం:**

సింగరేణి ఏరియాలోని ఏరియా జిఎం కార్యాలయం తోపాటు ఏరియాలోని అన్ని గనులు, విభాగాలలో ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగ అనే నినాదంతో శనివారం సింగరేణి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏరియా జిఎం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై, కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఏరియాలోని అన్ని గనులు, విభాగాలలో యోగా కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరు తమ దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని, దీంతో మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం సిద్ధిస్తుందని తెలిపారు. ఉద్యోగులందరూ ఆరోగ్యంగా ఉంటూనే సంస్థ మరింత ప్రగతి సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏరియాలోని వివిధ విభాగాల అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, జిఎం కార్యాలయ సిబ్బంది యోగాసనాలు వేసి, అనంతరం యోగ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జిఎం జిఎల్ ప్రసాద్, సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, సిఎంఓఏఐ ఏరియా జాయింట్ కార్యదర్శి రవి, డిజిఎం పర్సనల్ సిహెచ్ అశోక్, సీనియర్ పిఓ సత్యనారాయణ, ఏఐటియుసి జిఎం కార్యాలయ పిట్ కార్యదర్శి గీతిక, యోగ మాస్టర్ శంకర్, జిఎం కార్యాలయ ఉన్నత అధికారులు, కార్యాలయ సిబ్బంది, సింగరేణి అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

# యమహా షోరూం ఆధ్వర్యంలో హైబ్రిడ్ వాహనాల మైలేజ్‌పై అవగాహన





**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 20:**

హైబ్రిడ్ సాంకేతికతతో రూపొందిన ఫ్యాసినో 125 ఎఫ్ఐ, రేజర్ 125 ఎఫ్ఐ వాహనాల మైలేజ్ సామర్థ్యాన్ని వినియోగదారులకు పరిచయం చేస్తూ, జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలోని శ్రీ వాసవి మోటార్స్ యమహా షోరూం శనివారం ప్రత్యేక మైలేజ్ కాంటెస్ట్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రీజినల్ మేనేజర్ సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెరుగుతున్న ఇంధన ధరల నేపథ్యంలో అధిక మైలేజ్ అందించే వాహనాలపై వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారని, ఈ నేపథ్యంలో ఫ్యాసినో, రేజర్ హైబ్రిడ్ మోడళ్ల పనితీరును ప్రత్యక్షంగా చూపించేందుకు ఈ పోటీని నిర్వహించినట్లు తెలిపారు. హైబ్రిడ్ టెక్నాలజీ కారణంగా వాహనాలు తక్కువ ఇంధనంతో ఎక్కువ దూరం ప్రయాణించగలవని వివరించారు. అయితే మైలేజ్ పూర్తిగా డ్రైవింగ్ విధానం, రహదారి పరిస్థితులు, వాహన నిర్వహణపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. వినియోగదారులు వాహనాలను క్రమం తప్పకుండా సర్వీస్ చేయించుకోవడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. యమహా షోరూం నుంచి నిర్వహించిన ఈ టెస్ట్ డ్రైవ్ లో పాల్గొన్న వినియోగదారులు వాహనాలను స్వయంగా నడిపి, మైలేజ్‌ను పరిశీలించారు. పోటీలో సాయికుమార్ లీటరు పెట్రోల్‌కు 93 కిలోమీటర్ల మైలేజ్ సాధించి ప్రథమ స్థానాన్ని దక్కించుకోగా, నాయర్ మణికంఠ 87 కిలోమీటర్లతో ద్వితీయ స్థానం, విజయలక్ష్మి 83 కిలోమీటర్లతో తృతీయ స్థానం పొందారు. విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంతో హైబ్రిడ్ వాహనాలపై ఉన్న సందేహాలు నివృత్తి అయ్యాయని పలువురు వినియోగదారులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మహేందర్, అభిషేక్, లక్ష్మారెడ్డి, సేల్స్, సర్వీస్ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కడమంచి సహదేవుడికి ఘన సన్మానం

**జోగులాంబ గద్వాల్ జిల్లా అక్షర కలం ప్రతినిధి**



బేడా బుడ్గ జంగం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా సేవలందిస్తున్న కడమంచి సహదేవుడు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సంఘం నాయకులు కడమంచి సహదేవుడిని గజమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ రాజకీయంగా వెనుకబడిన బేడా బుడ్గ జంగం సమాజానికి చెందిన వ్యక్తి రాష్ట్ర స్థాయిలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా నియమితులు కావడం ఆనందదాయకమని పేర్కొన్నారు. కడమంచి సహదేవుడు తన సేవా కార్యక్రమాలు, సామాజిక ఉద్యమాలతో గుర్తింపు పొందారని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. రాజకీయ అధికారం లేని వర్గాలు కాలక్రమేణా మరుగున పడిపోయే ప్రమాదం ఉందని, అలాంటి పరిస్థితుల్లో కడమంచి సహదేవుడు అధికార పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ మంచి గుర్తింపు సాధించడం సమాజానికి గర్వకారణమని అన్నారు. భవిష్యత్తులో బేడా బుడ్గ జంగం సమాజం నుంచి ఎమ్మెల్యే వంటి ఉన్నత ప్రజాప్రతినిధులు ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బేడా బుడ్గ జంగం హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సిరిగిరి మన్నెం, ఉస్మానియా విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ డా. ఎన్.ఆర్. వెంకటేశం, రాష్ట్ర అధ్యక్షుడు అడ్వకేట్ చిత్తారి అనంతయ్య, అడ్వకేట్ డా. విభూది వెంకటేశ్వర్లు, డా. లోకేష్ బాబు, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు సిరిగిరి శ్రీను, జోగులమ్మ గద్వాల జిల్లా మాజీ అధ్యక్షుడు సిరిగిరి కృష్ణ, సోషల్ మీడియా అధ్యక్షుడు సిరివాటి రమేష్, యూత్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కడమంచి చెన్నయ్య, ఉపాధ్యక్షుడు వానరాశి వెంకటేష్, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు రాజు, కళ్లెం సోమయ్య , నిడుగొండ సిద్ధార్థ అశ్వ పెద్దయ్య, గాంజాయ్ నరసింహ , గాని గ విజయ్ తో పాటు పలువురు నాయకులు, యువకులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# నకిలీవిత్తనాలురైతులకుఇస్తేసహించేది లేదు

## సిపిఐ ఎం ఎల్ మాస్ లైన్, అఖిల భారత ఐక్య రైతు సంఘం.

**అక్షర కలం / భద్రాచలం**



భద్రాచలంపట్టణంసిపిఐ.ఎంఎల్.మాస్ లైన్ పార్టీ ఆఫీసులో ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న సి పి ఐ,ఎం ఎల్,మాస్ లైన్ పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్.సభ్యులుకె.రంగారెడ్డి,మాట్లాడుతూ నకిలీ విత్తనాలని రైతులకి ఇచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నఫెర్టిలైజర్.షాపులపై,బాండ్కంపెనీలపైఅగ్రికల్చర్అధికార ులుచర్యలుతీసుకోవాలనిఆయనఅన్నారు.చర్ల,దుమ్ముగూడెం మండలంలో బాండు మొక్కజొన్న పేరుతో నకిలీ విత్తన కంపెనీలు నకిలీ విత్తనాలు ఆదివాసిరైతులకు,ఇతరపేదలకుఅంటగట్టినిలువునముంచేస్తునా ్నరని కంపెనీలనువ్యాపారులపై కఠిన చర్యలు చేపట్టాలని ఆయన ఆవేదనవ్యక్తంచేశారు.చర్లమండలంలో కొత్తపల్లి గ్రామానికి చెందిన ఇరవై ఒక్కమందిఆదివాసిరైతులనుమోసపూరితమాటలుచెప్పిబాండువె ుక్కజొన్న విత్తనాలు చర్ల లోనే ఒక వ్యాపారి మూడు నుంచి నాలుగు టన్నులుఎకరానికిదిగుబడివస్తుందనినమ్మించి పంట చేపించగా ఒక్క టన్ను కూడా దిగుబడి రాలేదని ఆయనఅన్నారు.ఏజెన్సీలోఆదివాసిచట్టాలు అమల్లో ఉన్న ఏజెన్సీ ప్రాంతంలో ఇలా చేయడం నేరం అనే ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం తాసిల్దార్, పోలీస్ స్టేషన్ లో కూడా సంబంధిత రైతులు ఫిర్యాదు చేసిన స్పందించకపోవడం అన్యాయమని ఆయన అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే నకిలీ విత్తనవ్యాపారులమరియుకంపెనీ లపైకఠినచర్యలుతీసుకోవాలనిరె తులకునష్టపరిహారంఇప్పించాలనిబహుళ జాతి కంపెనీలను ఏజెన్సీలో నిషేధించాలనిదొంగచాటుగానేబినామీ పేర్లతో నకిలీ విత్తనాలు అమ్మకం సాగిస్తే సహించేదే లేదని ఆయన అన్నారు. లేనియెడల రైతులను సమీకరించిఉద్యమాలుచేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకురాలు కే .కల్పన,డివిజన్ నాయకులుదాసర.సాయన్న,మునిగేల.శివ ప్రశాంత్,రమక్క,వెంకటేశ్వర్లు, శాంతక్క, తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల ఆనందకర బాల్యానికి కృషి చేయాలి.

**జోగులాంబ గద్వాల్ జిల్లా అక్షర కలం ప్రతినిధి**




చిన్నారులపై జరిగే వివిధ రకాల అఘాయిత్యాలను నివారించేందుకు వారి ఆనందకరమైన బాల్యానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు రాజేంద్ర అన్నారు. గద్వాల మండలంలోని గోనుపాడు గ్రామం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో "పిల్లలపై నేరాల నివారణ" అంశంపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలపై జరిగే శారీరక, మానసిక, లైంగిక వేధింపులను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాలల హక్కులను పరిరక్షించడం సమాజంలోని ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, బాలల అక్రమ రవాణా వంటి సమస్యలు పిల్లల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని వివరించారు. అదే విధంగా పోక్సో చట్టం గురించి అవగాహన కల్పిస్తూ, పిల్లలపై లైంగిక నేరాలకు పాల్పడిన వారికి కఠినమైన శిక్షలు విధించబడతాయని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సంరక్షకులు పిల్లల ప్రవర్తనలో మార్పులను గమనించి, ఏవైనా అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.పిల్లలు తమకు ఎదురయ్యే సమస్యలు, వేధింపులు, ప్రమాదకర పరిస్థితులకు భయపడకుండా పెద్దలకు తెలియజేయాలని, ప్రభుత్వం అందుబాటులో ఉంచిన సహాయ వ్యవస్థలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అత్యవసర పరిస్థితుల్లో వినియోగించాల్సిన 1098 (చైల్డ్ హెల్ప్‌లైన్), 100 (పోలీస్ అత్యవసర సేవలు) మరియు 15100 హెల్ప్‌లైన్ నంబర్ల గురించి విద్యార్థులు, గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యులు శ్రీనివాసులు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు లక్ష్మన్న స్వామి, విద్యా శాఖ, భరోసా, సఖి సెంటర్ కోఆర్డినేటర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

## రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు.

## నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులపై ఉన్నతస్థాయి సమీక్ష.

## జోగులాంబ గద్వాల జిల్లా నుంచి పాల్గొన్న కలెక్టర్, గద్వాల ఎమ్మెల్యే , అధికారులు.

**జోగులాంబ గద్వాల జిల్లా అక్షర కలం ప్రతినిధి**

రాష్ట్రంలో సాగునీటి రంగ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా చేపట్టిన ప్రతిష్ఠాత్మక సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు.శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌తో పాటు నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల పరిధిలో కొనసాగుతున్న వివిధ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ అంశాలపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యేలు డాక్టర్ వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి , గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ, సర్వే, నీటిపారుదల శాఖల ఉన్నతాధికారులతో కలిసి మంత్రి సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రాజెక్టుల వారీగా, నియోజకవర్గాల వారీగా భూసేకరణ పురోగతిని మంత్రి క్షుణ్ణంగా సమీక్షించారు. ఇప్పటివరకు ఎంత భూమి సేకరించబడింది, ఎంత భూమి పీడీ (ప్రాథమిక నోటిఫికేషన్) దశలో ఉంది, ఎంత భూమి పీఎం స్థాయిలో ఉంది, ఎన్ని అవార్డులు ప్రకటించారు, ఎంత పరిహారం చెల్లించారు, ఇంకా ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయనే అంశాలపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల జిల్లాలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ పనులను వేగవంతం చేయాలని ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారని గుర్తు చేశారు. ఆ దిశగా అధికారులు మరింత బాధ్యతతో పనిచేసి పెండింగ్‌లో ఉన్న సమస్యలను సెప్టెంబర్ 15లోగా పూర్తిస్థాయిలో పరిష్కరించాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని, సాగునీటి వనరుల విస్తరణ ద్వారానే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని తెలిపారు. రైతుల అభ్యంతరాలు, భూవివాదాలు, పరిహారం చెల్లింపులకు సంబంధించిన అంశాలను ప్రత్యేకంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఈ సందర్భంగా మంత్రి అధికారులను ఆదేశించారు. జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ నెట్టెంపాడు, గట్టు ఎత్తిపోతల పథకాలతో పాటు మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణకు రెవిన్యూ, ఇరిగేషన్, సర్వే అధికారులతో ప్రత్యేక టీములు ఏర్పాటు చేసి కృషి చేస్తున్నామన్నారు. ప్రతి శుక్రవారం భూసేకరణ విషయంపై సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ ముందుకెళ్తున్నామన్నారు. ఆయా ప్రాజెక్టుల పనులు పూర్తయితే సాగునీటితోపాటు వ్యవసాయాధారిత పరిశ్రమలకు కూడా ప్రోత్సాహం లభించి గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో సాగునీటి ప్రాజెక్టుల పాత్ర అత్యంత కీలకమని వారు అభిప్రాయపడ్డారు. అనంతరం జిల్లా పరిధిలో కొనసాగుతున్న భూసేకరణ ప్రక్రియపై సమగ్ర నివేదికలను సమర్పించారు. ఇప్పటివరకు జరిగిన భూసేకరణ, పరిహారం చెల్లింపులు, పెండింగ్‌లో ఉన్న కేసులు, కోర్టు వివాదాలు, రైతుల అభ్యంతరాలు తదితర అంశాలపై వివరాలు వెల్లడించారు. భూసేకరణలో ఎదురవుతున్న సమస్యలను అధిగమించేందుకు తీసుకుంటున్న చర్యలను ఈ సమావేశంలో క్షుణ్ణంగా వివరించారు. అనంతరం నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయా ప్రాజెక్టుల పురోగతిని వివరించారు. ఈ సమావేశంలో సాగు నీటి ప్రాజెక్టుల ఎస్సీలు, ఈఈలు, ఏఈలు, ఆర్డీవోలు, తహసిల్దార్లు, రెవెన్యూ అధికారులు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు, ఇంజినీరింగ్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.






అక్షరకలం
తెలుగు దినపత్రిక

సంపాదకీయం...

# సమగ్ర పంటల విధానమే మేలు !

**దేశంలో పంటల విధానంపై సమగ్రత లోపించింది. రైతులు తమకు తోచిన పంటలు వేస్తున్నారు. ధరల కోసం దేబురిస్తున్నారు. ప్రభుత్వాలు వీలైనంత మేరకు కొంటున్నాయి. వీలుకాకపోతే చేతులెత్తేస్తున్నాయి. ముఖ్యంగా వరి, జొన్న, మక్కజొన్నలనే పండించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికే దేశంలో ధాన్యం బాగా పోగయ్యింది. డిమాండ్ ఉన్న పంటలు వేయడం, సేంద్రియం వైపు మళ్లడంలో రైతులు ఇప్పటికీ వెనకడుగు వేస్తున్నారు. దీంతో సంప్రదాయ వరి పండిస్తూ చేతులు కాల్చుకుంటున్నారు. ఈ విధానం ముందుగా పోవాలి. ప్రభుత్వాలు కూడా రైతులను చైతన్యం చేయడం లేదా, ఫలానా పంటలు వేయండి అని చెప్పడం లేదు. తెలంగాణ రైతుల పరిస్థితి తీసుకుంటే ఇదే అర్థం అవుతోంది. సన్నాలు పండించిన వారికి గిట్టుబాటు ధరలు వస్తున్నాయి. మద్దతు ధరలను మించి కొంటున్నారు. తాజాగా మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మార్కెట్ యార్డులో సన్న వడ్లకు డిమాండ్ పెరిగింది. వరుసగా రెండ్రోజుల నుంచి 3వేలకు పైగానే మద్దతు ధరలు దక్కుతున్నాయి. ప్రభుత్వం కూడా సన్నాలు పండించాలని, ఏడు రకాలను తాజాగా గుర్తించింది. కానీ మండలాల వారిగా రైతులతో మాట్లాడి వారిని ఒప్పించి, రైతుల పంటల విధానంలో మార్పులు తీసుకుని రావాల్సి ఉంది.**

ఇవన్నీ ఒక ఎత్తయితే కేంద్రం కూడా ధాన్యం మొత్తాన్ని కొనడానికి ముందుకు రావడం లేదు. టార్గెట్లు విధించి, ఆమేరకు ధాన్యం సేకరణకు రాష్ట్ర ప్రభుత్వాలకు చెబుతోంది. గతంలో బిఆర్ఎస్ అధికారంలో ఉండగా ఇలాగే జరిగింది. ఢిల్లీలో కూడా బిఆర్ఎస్ అధినేత, ఆనాటి సిఎం కెసిఆర్ ధర్నాకు దిగారు. అయినా నేటికీ మార్పు రాలేదు. అందువల్ల రాష్ట్రాలు తమకుతాముగా సమగ్ర పంటల విధానం అమలు చేయాలి. కేవలం ఉచిత విద్యుత్, రైతుభరోసా డబ్బులు వేస్తే సరిపోదు. ఏ పంటలు వేయాలో, వాటికి మార్కెటింగ్ ఎలా ఉంటుందో తెలియచేయాలి. ప్రభుత్వాల జోక్యం లేకుండానే రైతులు పంటలు అమ్ముకునే పరిస్థితిని తీసుకుని రావాలి. ఇక విషయానికి వస్తే ఖరీఫ్ ముంచుకొస్తున్న వేళ రబీ పంటల కొనుగోళ్లు ఇంకా సాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో పంటల కొనుగోళ్లపై కాంగ్రెస్ సర్కార్ చేతులెత్తేసింది. రైతులు పండించిన చివరి గింజ వరకు కొంటామంటూ చెబుతూ వచ్చిన మంత్రులు, ఇప్పుడు ఊహించని రీతిలో ప్రకటన చేశారు. ధాన్యం, మక్కజొన్న, జొన్న, కందులు, పెసర్లు.. ఇలా పంట ఏదైనా సరే ఇక రాష్ట్ర ప్రభుత్వం తరఫున పంటలు కొనుగోలు చేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. కేంద్ర ప్రభుత్వం ఎంత కొనాలని చెబితే అంతే కొంటామని, అంతకుమించి గింజ కూడా ఎక్కువ కొనేది లేదని స్పష్టంచేసింది. గురువారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఇన్‌ఫార్మల్ క్యాబినెట్ సమావేశంలో పంటల కొనుగోళ్లపై సంచలన నిర్ణయం తీసుకున్నది. ధాన్యం, మక్కలు, జొన్నలు, కందులు, పెసర్లు ఇలా పంటల కొనుగోళ్ల బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపైకి నెట్టేసింది. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే ఏ పంటనైనా సరే కేంద్రం నిర్దేశించిన కోటా మేరకే కొనుగోలు చేస్తామని మంత్రి ఉత్తమ్ మీడియాకు చెప్పారు. పంటలకు మద్దతు ధరను కేంద్రమే నిర్ణయిస్తుంది కాబట్టి.. పంటల కొనుగోలు బాధ్యత కూడా కేంద్ర ప్రభుత్వానిదేనని అన్నారు. మంత్రి వ్యాఖ్యల నేపథ్యంలో ఇకపై రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయబోదనేది సుస్పష్టం. కేంద్రం కొనుగోలు చేస్తామని చెప్పిన పంటలను, కేంద్రం ఇచ్చిన కోటా మేరకే ఇక్కడ కేంద్రం ఇచ్చిన డబ్బులతో రైతుల నుంచి సేకరించి కేంద్రానికి అందిస్తుంది. అంతేగానీ ఒకవేళ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన కోటాకు మించి పంటలు ఉత్పత్తి అయితే ఆ పంటలను రాష్ట్ర ప్రభుత్వం తన సొంత నిధులతో కొనుగోలు చేయబోదు. పంటల కొనుగోళ్లలో కేంద్రం కోటా పూర్తికాగానే ఆ కేంద్రాలను మూసివేస్తుంది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యంతో పాటు ఇతర పంటలు ఉన్నా ఇక నుంచి ప్రభుత్వం పట్టించుకోదు. మొత్తంగా ఇదే విషయం అర్థం అవుతోంది. ఇలాంటి సమయంలో ఏం చేయాలన్నది కూడా ప్రభుత్వం ప్రకటించాలి. ఎంతమేరకు వరి వేయాలో, అదికూడా ఏ రకం వేయాలో రైతులకు చెప్పాలి. ఏయే జిల్లాల్లో వరి వేయాలో, వేయకూడదో కూడా నిర్ణయించాలి. నిజానికి ధాన్యం సేకరణ బాధ్యత కేంద్రానిదే. కేంద్రం ఆదేశాల మేరకే రాష్ట్రాలు ధాన్యం సేకరణ చేసి, ఎఫ్‌సిఐకి అప్పగిస్తుంది. ఈ క్రమంలో ఊష్ట్రంలోని వివిధ పంటలను కేంద్ర ప్రభుత్వం కొంత మేరకే కొనుగోలు చేస్తుంది. ఉత్పత్తి అయిన ధాన్యంలో మూడో వంతు మాత్రమే కొంటుంది. ఇక పెసర్లు, కందులు, జొన్నలు, సన్‌ఫ్లవర్, సోయాబీన్ వంటి పంటలను మొత్తం ఉత్పత్తిలో 25శాతం మాత్రమే కొనుగోలు చేస్తుంది. ఒకవేళ కేంద్ర ప్రభుత్వానికి అవసరముండి, పంట



ఎక్కువగా ఉంటే మరో 5-10శాతం వరకు కొనుగోలుకు అనుమతి ఇస్తుంది. ఒత్తిడి తెచ్చినర రాష్ట్రాలకే ఈ వెసులబాటు ఉంటుంది. ఇకపోతే కేంద్ర ప్రభుత్వం.. మక్కలను మాత్రం అసలే కొనుగోలు చేయదు. ఎంత ఉత్పత్తి అయినా సరే ఒక్క గింజ కూడా కొనుగోలు చేయదు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం తన కోటా కింద కొనుగోలు చేయగా మిగిలిన పంటలను కొనుగోలు చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే. కేంద్రం తన కోటా మేరకు కొనుగోలు చేసిన తర్వాత మిగిలిన పంట ఉత్పత్తులను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు నిరాకరిస్తే రైతులు ఏం కావాలన్నది ఆలోచన చేయాలి. అందువల్ల పంటల విధానం అమల్లోకి రావాలి. ఏయే పంటలు వేయాలో, ఎంత విస్తీర్ణంలో వేయాలో ప్రభుత్వం నిర్ణయించాలి. అందుకు తగ్గట్లుగా ఎరువుల,విత్తనాలు సరఫరాచేసి, ఆయా పంటలనే ప్రోత్సహించడం ద్వారా సంక్షోభాన్ని అధిగమించవచ్చు.

# అల్పాహార పథకం సిద్దిపేట లో అమలు పరచక పోవడం సిద్దిపేట పై కక్షపూరిత వైఖరి కి నిదర్శనం

**పాఠశాల లో అల్పాహార పథకం అమలు పరచాలి.. లేనిపక్షం లో విద్యార్థుల తో పోరాటం చేపడతాం**

**సిఎం రేవంత్ కి సిద్దిపేట బి ఆర్ ఎస్ నేతల హెచ్చరిక**

**సిద్దిపేట కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్**

**అక్షర కలం సిద్దిపేట జూన్ 20:**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేట పై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని చెప్పడానికి పాఠశాలల్లో అల్పాహార పథకం సిద్దిపేటలో అమలు పరచకపోవడమే నిదర్శనమని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాల సాయిరాం ఆరోపించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బి.ఆర్.ఎస్ నాయకులతో కలిసి వారు మాట్లాడారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సిద్దిపేటకు మంజూరు చేసిన అనేక అభివృద్ధి పనులను వేరే నియోజకవర్గాలకు తరలించుకు వెళ్తున్నారని సగం పనులు పూర్తయినా కూడా వాటిని కూడా ఎందుకు పూర్తి చేయడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ చెప్పుకుంటున్న ప్రజా



పాలన అనేది మాటల్లోనే ఉంది కానీ చేతల్లో లేదన్నారు.ప్రభుత్వ ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు సిద్దిపేటలో కనీసం మార్కెట్ కమిటీ చైర్మన్ ని కూడా నియమించలేని దౌర్భాగ్య స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. నిధుల కేటాయింపులో సంక్షేమ పథకాల అభివృద్ధిలో సిద్దిపేట నియోజకవర్గానికి ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఈ విషయంపై సిద్దిపేట కాంగ్రెస్ నాయకులు ఏం చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా నియోజకవర్గానికి ఒక పబ్లిక్ స్కూల్ ఏమైందని ప్రశ్నించారు. మీడియా కవరేజ్ కోసం, ప్రజలలో గుర్తింపు కోసం హరీష్ రావు పై పోటీ చేస్తామని ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. బి ఆర్ ఎస్ ఎమ్మెల్యే వివేకానంద చెప్పినట్లుగా హరీష్ రావు పై పోటీ అంటే పోచమ్మ గుడి ముందు పొట్టేలును కట్టేసినట్లేనని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేట జిల్లాలో పాఠశాలల్లో అల్పాహార పథకం అమలు పరచాలని.... లేనిపక్షంలో విద్యార్థుల పక్షాన తాము పోరాటం చేస్తామని హెచ్చరించారు. అలాగే గతంలో సిద్దిపేటకు మంజూరైన అభివృద్ధి పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో బి ఆర్ ఎస్ నాయకులు పింది అరవింద్, సాయి ప్రేమ్,మోహిజ్, మహిపాల్ గౌడ్, బెదురు తిరుపతి, పరశురామ్ గౌడ్, వేణు, నాగరాజు, లెగిశెట్టి నవీన్ పలువురు పాల్గొన్నారు.

# చిన్నవార్వాల్ పాఠశాలలో తల్లిదండ్రుల-ఉపాధ్యాయుల సమావేశం

**గండీడ్, జూన్ 20 (అక్షర కలం):**

మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం చిన్నవార్వాల్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల-ఉపాధ్యాయుల సమావేశం (పీటీఎం) నిర్వహించారు. ఈ సందర్భంగా





విద్యార్థుల విద్యా పురోగతి, హాజరు, క్రమశిక్షణ, అభ్యాస నైపుణ్యాలపై తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు చర్చించారు. పిల్లల సమగ్ర అభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అంగడి అరుణదేవి, గ్రామ సర్పంచ్ ఎడ్లకాడి చిన్న నర్సయ్య, ఉపసర్పంచ్ దాసరి రాములు, ఉపాధ్యాయులు పగిడ్యాల బూరి కృష్ణయ్య, బి. మల్లేష్, కె. వెంకటయ్యతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా జరిగింది.

# నేరాల నియంత్రణ, ప్రజా భద్రత, విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి.. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

**జగిత్యాల జూన్ 20 (అక్షర కలం)**

పోలీస్ శాఖలో సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడం, ప్రజలకు వేగవంతమైన మరియు పారదర్శకమైన పోలీసింగ్ అందించడశీ , ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలను సమీక్షించేందు జిల్లా ఎస్పీ అశోక్



కుమార్, శనివారం జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్ మరియు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసుల వివరాలు, పెండింగ్ కేసుల పురోగతి, విచారణ విధానం, నేరాల నియంత్రణ చర్యలు, స్టేషన్ నిర్వహణ, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల దర్యాప్తులో నాణ్యతను పెంచాలని, ప్రతి కేసును శాస్త్రీయ ఆధారాలతో విచారించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.అలాగే స్టేషన్‌లో నిర్వహిస్తున్న రిజిస్టర్లు, రికార్డులు, సిబ్బంది విధుల కేటాయింపు తదితర అంశాలను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను ఓపికగా విని చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనతరం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులు, ట్రాఫిక్ చలానాలు, రోడ్డు భద్రతా కార్యక్రమాల అమలును పరిశీలించారు. స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, వాహనాల పార్కింగ్ విధానం, ట్రాఫిక్ నియంత్రణ కోసం వినియోగిస్తున్న పరికరాల సామగ్రి పనితీరును తనిఖీ చేశారు.జిల్లాలో పెరుగుతున్న వాహన రద్దీని దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ నియంత్రణలో సాంకేతికత వినియోగాన్ని మరింత విస్తరించాలని సూచించారు. ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.రోడ్డు ప్రమాదాల నివారణలో ట్రాఫిక్ పోలీసుల పాత్ర అత్యంత కీలకమని, ప్రజలకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు. ఎస్పీ వెంట డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, ట్రాఫిక్ ఎస్.ఐ మల్లేష్, ఎస్.ఐ లు సదకర్, కుమారస్వామి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# అత్యవసర పరిస్థితుల్లో జిల్లా కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలి... జిల్లా రెవెన్యూ అధికారి రాంమూర్తి

**24 గంటల పాటు మూడు షిఫ్టుల్లో కంట్రోల్ రూమ్ సేవలు**

**అత్యవసర సమయాలలో టోల్ ఫ్రీ నెంబర్ 1077 కు కాల్ చేయాలి**



**భారీ వర్షాలు, ఇతర అత్యవసర పరిస్థితులపై తక్షణ స్పందన**

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి :**

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశాల మేరకు జిల్లాలో అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కలెక్టరేట్ లో జిల్లా కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించినట్లు జిల్లా రెవెన్యూ అధికారి సి.హెచ్. రాంమూర్తి శనివారం తెలిపారు.జిల్లా కంట్రోల్ రూమ్ 24 గంటల పాటు మూడు షిఫ్టుల్లో నిరంతరాయంగా పని చేస్తుందని అన్నారు. భారీ వర్షాలు, వరదలు, ప్రకృతి వైపరీత్యాలు, తదితర అత్యవసర పరిస్థితుల సమాచారాన్ని ప్రజలు వెంటనే కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని సూచించారు.అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు టోల్ ఫ్రీ నంబర్ 1077 లేదా మొబైల్ నంబర్ 9063211298 కు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చని తెలిపారు. అలాగే వ్యవసాయానికి సంబంధించి జిల్లాలో నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువుల విక్రయాలు, ఇతరాలపై కూడా ప్రజలు కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.కంట్రోల్ రూమ్‌కు వచ్చే ప్రతి కాల్, ఫిర్యాదును నమోదు చేసి సంబంధిత శాఖలకు వెంటనే సమాచారం అందజేసి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు అత్యవసర సమయాల్లో కంట్రోల్ రూమ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి సి.హెచ్. రాంమూర్తి కోరారు.

# ఇల్లందు ఆర్టీసీ డిపో నుండి భూపాలపల్లి కి రెండు స్పెషల్ సర్వీస్ బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య.

**అక్షర కలం / భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి :-**


ఇల్లందు ఆర్టీసీ డిపో నుండి భూపాలపల్లికి శనివారం రెండు నూతన బస్ సర్వీసులను ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణమిత్ర డానియల్ ఇల్లందు మున్సిపల్ వైస్ చైర్మన్ పెండెల రాజు హాజరై కొబ్బరికాయలు కొట్టి జెండా ఊపి బస్సులను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇల్లెందు శాసనసభ్యులు కోరం కనకయ్య మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేయబడ్డ ఇల్లందు నుండి వయా నర్సంపేట ములుగు జిల్లాల నుండి భూపాలపల్లి కి నేరుగా వెళ్లేందుకు రెండు నూతన బస్సులు ప్రారంభం కావడం ఇల్లందు పట్టణ



ప్రజలకు పరిసర ప్రాంతాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉండటం సంతోషకరం అన్నారు. ఈ కొత్త సర్వీస్ల వల్ల భూపాలపల్లికి నేరుగా వెళ్లే ప్రయాణికులకు మరింత సౌకర్యవంతగా ఉంటుందన్నారు. ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోపరుచుకోవాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య కోరారు. అవసరమైన మరికొన్ని బస్సులకు సైతం ఇల్లందు నుండి వెళ్లేందుకు కృషి చేయగలన ని ఆయన పేర్కొన్నారు. ఇల్లందు బస్సు డిపో సమస్యలు ఏవైనా తన దృష్టికి వచ్చినప్పుడు పరిష్కరించి సౌకర్యాలను కలుగజేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇల్లందు నూతన డిపో మేనేజర్ వేమూరి సుభాషిణి మాట్లాడుతూ ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా మరిన్ని సర్వీసులు నడపడానికి చర్యలు తీసుకుంటామని డి ఎం. సుభాషిని పేర్కొన్నారు. ఇల్లందు ఆర్టీసీ డిపో నూతన మేనేజర్ సుభాషిని ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇంచార్జి సునీత, గ్యారేజ్ ఇంచార్జి ఎన్. వి. నారాయణ, ఎస్. వై.ఎస్ నాగరాజు, ఇల్లందు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లం సూర్యం, ఇల్లందు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మండల రాము, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు మడుగు సాంబమూర్తి, వార్డు కౌన్సిలర్లు ఎండి జాఫర్, బానోతు వంశి, ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు, రేపల్లెవాడ సర్పంచ్ బానోత్ శారద, ఇల్లందు పట్టణ మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు గాలి పల్లి స్వరూప, నాయకులు శివరాత్రి ఎల్లయ్య, సెక్యూరిటీ సిబ్బంది ట్రాఫిక్ సూపర్వైజర్లు గ్యారేజీ సిబ్బంది,కండక్టర్లు, డ్రైవర్లు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

# ఆట







# అఫ్ఘాన్‌పై భారత్ భారీ స్కోరు..!

అఫ్ఘానిస్థాన్‌తో లక్నోలో జరుగుతున్న రెండో వన్డేలో భారత్ బ్యాటింగ్‌లో రెచ్చిపోయింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (154), ఇషాన్ కిషన్ అద్భుత సెంచరీలతో కదంతొక్కడంతో టీమిండియా 49.5 ఓవర్లలో 402 పరుగుల భారీ స్కోరు సాధించింది. రోహిత్ శర్మ 48 పరుగులతో రాణించగా, యశస్వి జైస్వాల్ (4) నిరాశపరిచాడు. ఇషాన్ కిషన్ ఆఖరిలో టీ20 తరహాలో బ్యాటింగ్ చేసి సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. అఫ్ఘాన్ బౌలర్లలో నంగియాలై కరోటే 4 వికెట్లు పడగొట్టాడు. అఫ్ఘానిస్థాన్‌తో జరుగుతున్న రెండో వన్డేలో భారత్ భారీ స్కోరు చేసింది. లక్నో వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన అఫ్ఘానిస్థాన్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. దీంతో టీమిండియా ఫస్ట్ బ్యాటింగ్‌కు దిగింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, ఇషాన్ కిషన్ సెంచరీలతో భారత్.. భారీ స్కోరు చేసింది. 49.5 ఓవర్లలో 402 పరుగులకు ఆలౌట్ అయింది.


# మహిళల విశ్వరూపం

మహిళల టీ20 క్రికెట్ ప్రపంచకప్‌లో పరుగుల సునామీ కురుస్తోంది. మైదానంలోకి దిగితే చాలు సిక్సర్లు, ఫోర్ల వర్షంతో బ్యాటర్లు స్టేడియాలను హోరెత్తిస్తున్నారు. తాజాగా ఇంగ్లాండ్, భారత్ జట్లు సృష్టించిన సునామీతో ఐసీసీ ఉమెన్స్ టీ20 వరల్డ్ కప్ చరిత్రలోనే అత్యధిక స్కోర్ల రికార్డులు మారిపోతున్నాయి. మహిళల టీ20 ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక స్కోరు సాధించిన జట్టుగా ఇంగ్లాండ్ ఉమెన్స్ టీమ్ సరికొత్త రికార్డు సృష్టించింది. 2026 జూన్ 12న బర్మింగ్‌హామ్ వేదికగా శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లాండ్ బ్యాటర్లు లంక బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టారు. నిర్ణీత 20 ఓవర్లలో కేవలం ఒకే ఒక్క వికెట్ కోల్పోయి ఏకంగా 219 పరుగుల భారీ స్కోరు సాధించారు. ఓవర్ కి 10.95 రన్ రేట్‌తో సాగిన ఈ ఇన్నింగ్స్ ఉమెన్స్ క్రికెట్ హిస్టరీలోనే ఒక మైలురాయిగా నిలిచిపోయింది. బౌండరీల వర్షం కురిపించిన ఇంగ్లాండ్ టీమ్, ఆ మ్యాచ్‌లో ఘనవిజయం సాధించి చరిత్ర పుటల్లోకెక్కింది. కేవలం ఈ ఏడాదే కాదు, గతంలోనూ ఇంగ్లాండ్ జట్టు ఇలాంటి పరుగుల విధ్వంసాన్నే సృష్టించింది. ఈ జాబితాలో రెండో స్థానం కూడా ఇంగ్లాండ్ ఖాతాలోనే ఉంది. 2023 ఫిబ్రవరి 21న కేప్ టౌన్ వేదికగా పాకిస్తాన్‌తో జరిగిన వరల్డ్ కప్ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ మహిళల జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది. పాక్ బౌలింగ్‌ను చీల్చిచెండాడుతూ 10.65 రన్ రేట్‌తో ఈ స్కోరును నమోదు చేశారు. ఈ మ్యాచ్‌లోనూ ఇంగ్లాండ్ ఘన విజయాన్ని అందుకుంది. ఇక తాజాగా లీడ్స్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో భారత మహిళల జట్టు సరికొత్త రికార్డును తన పేరిట లిఖించుకుంది. నెదర్లాండ్స్ జట్టుతో జరిగిన ఉత్కంఠభరిత పోరులో టీమిండియా బ్యాటర్లు చెలరేగి ఆడారు.

# సెనెగల్‌పై ఫ్రాన్స్ ఘన విజయం

ఫిఫా వరల్డ్ కప్ 2026 గ్రూప్ దశలో భాగంగా న్యూజెర్సీ వేదికగా జరిగిన పోరులో ఫ్రాన్స్ 3–1 తేడాతో సెనెగల్‌పై ఘన విజయాన్ని నమోదు చేసింది. ఈ మ్యాచ్‌లో రెండు అద్భుతమైన గోల్స్‌తో మెరిసిన ఎంబాపె, జట్టును గెలిపించడమే కాకుండా ఫుట్‌బాల్ దిగ్గజాల రికార్డులను తిరగరాస్తూ సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఫస్టాఫ్‌లో సెనెగల్ జట్టు ఫ్రాన్స్‌కు గట్టి సవాలు విసిరింది. కానీ, సెకండాఫ్‌లో ఎంబాపె వ్యూహంతో ఫ్రాన్స్‌ను విజయం వరించింది. సెనెగల్ జట్టు చాలా పక్కా ప్రణాళికతో బరిలోకి దిగింది. ఫ్రాన్స్ కెప్టెన్ కిలియన్ ఎంబాపెను కట్టడి చేయడమే లక్ష్యంగా ఆడింది. ఫలితంగా ఫస్టాఫ్ ముగిసేసరికి ఎంబాపె కేవలం 14 సార్లు మాత్రమే బంతిని తాకగలిగాడు. దీనితో మొదటి 45 నిమిషాల ఆట ఒక గోల్ నమోదు కాకుండానే ముగిసింది. ఇక సెకండాఫ్‌లో ఫ్రాన్స్ జట్టు పక్కా వ్యూహంతో మైదానంలోకి అడుగుపెట్టింది. ఎంబాపె ఒక్కసారిగా తన వేగాన్ని పెంచాడు. 66వ నిమిషంలో జూల్స్ కౌండే నుంచి అందిన ఒక అద్భుతమైన త్రూ-బాల్‌ను ఎంబాపె ఆధీనంలోకి తీసుకున్నాడు. అంతవరకు పెనాల్టీ బాక్స్‌లో బంతిని నియంత్రించడానికి ఇబ్బంది పడిన ఎంబాపె ఈసారి మాత్రం ఎలాంటి పొరపాటు చేయలేదు. అత్యంత చాకచక్యంగా బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపి ఫ్రాన్స్‌కు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. తొలి గోల్ వచ్చిన ఉత్సాహంలో ఫ్రాన్స్ మరింత దూకుడు పెంచింది. కొద్దిసేపటికే బ్రాడ్లీ బార్కోలా మరో గోల్ సాధించాడు. దీంతో ఫ్రాన్స్ ఆధిక్యం 2-0కు చేరింది. మ్యాచ్ దాదాపు ముగింపునకు వచ్చేసింది అనుకుంటున్న తరుణంలో, ఇంజూరీ టైమ్‌లో సెనెగల్ ప్లేయర్ గోల్‌గా మలిచాడు. దీంతో స్కోరు 2-1 గా మారి మ్యాచ్‌లో ఒక్కసారిగా ఉత్కంఠ పెరిగింది. దీంతో ఆ మ్యాచ్ డ్రా అవుతుందేమోనన్న ఆందోళనలో ఫ్రాన్స్ అభిమానులు ఉన్నారు. అయితే సెనెగల్ ఆనందం ఎక్కువ సేపు నిలవలేదు. ఫ్రాన్స్ ఎదురుదాడికి దిగింది. ఎంబాపె కొట్టిన లాంగ్-రేంజ్ షాట్ నెట్‌లోకి దూసుకెళ్లింది. ఈ అద్భుతమైన గోల్‌తో ఫ్రాన్స్ 3-1తో విజయాన్ని ఖరారు చేసుకుంది.

అక్షరకలం
తెలుగు దినపత్రిక



# సినిమా
CINEMA



# మరింత మెరుగ్గా సింగ్ గీతం గ్రాఫిక్స్

ప్రముఖ దిగ్గజ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో నాగ్ అశ్విన్ నిర్మించిన తాజా చిత్రం 'సింగ్ గీతం' జూన్ 12న థియేటర్లలో విడుదలైంది. ఈ సినిమా క్షి రిలీజ్‌లో కొన్ని కీలక మార్పులు చేసినట్లు నాగ్ అశ్విన్ తెలిపారు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. 'ఈ సినిమా ఓటీటీ వెర్షన్.. థియేటర్ వెర్షన్ కంటే భిన్నంగా ఉంటుంది' అని నాగ్‌అశ్విన్ వెల్లడించారు. నిర్మాణదశ చివర్లో ఎదురైన సవాళ్ల గురించి ఆయన ప్రస్తావిస్తూ.. క్లైమాక్స్‌లోని కంప్యూటర్ గ్రాఫిక్స్ ఇంకా మెరుగ్గా ఉండాల్సిందని అనిపించింది. డిజిటల్ విడుదలకు ముందు, గ్రాఫిక్స్‌ని మరింత మెరుగు పరచడానికి మా బృందం యోచిస్తోంది. ఈ చిత్రాన్ని కొన్ని దశాబ్దాల పాటు ప్రేక్షకులు డిజిటల్ వేదికగా ఆదరిస్తూనే ఉంటారు. అందుకే భవిష్యత్తు రోజులకు అనుగుణంగా సాంకేతిక మార్పులు చేయాలని భావించాం' అని పేర్కొన్నారు. ఈ మూవీకి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. కథానాయకుడు విజయ్ దేవరకొండ అతిథి పాత్రలో మెరిశారు. ఈ చిత్ర డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ వేదిక 'నెట్‌ఫ్లిక్స్‌కి విక్రయించినట్లు సమాచారం. అయితే దీనిపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ప్రస్తుతం ఈ సినిమాకి ప్రేక్షకుల నుంచి సానుకూల స్పందన లభిస్తోంది. అందువల్ల ఓటీటీలోకి రావడానికి కొంత సమయం పట్టొచ్చని తెలుస్తోంది.

# లాయర్ పాత్రలో కీర్తి సురేశ్

## జులై 24న విడుదల కానున్న సత్తియవాన్ సావిత్రి

ప్రవీణ్ ఎస్. విజయ్ దర్శకత్వంలో, కథానాయిక కీర్తి సురేశ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న కోర్టు రూమ్ డ్రామా చిత్రం 'సత్తియవాన్ సావిత్రి' విడుదల తేదీ ఖరారైంది. జులై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ విషయాన్ని కీర్తి తన ఇన్‌స్టా పోస్ట్‌లో వెల్లడించారు. ఈ సందర్భంగా పంచుకున్న పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఇందులో కీర్తి సురేశ్ న్యాయవాదిగా ప్రత్యర్థిని సవాల్ చేస్తున్నట్లు కన్పించింది. ఈ పోస్టర్‌పై అభిమానులు స్పందిస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. మరో పవర్‌ఫుల్ పాత్రలో కీర్తిని చూసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నామంటూ కామెంట్లు పెట్టారు. ఈ చిత్రం గురించి దర్శకుడు ప్రవీణ్ ఎస్ విజయ్ ఇటీవల మాట్లాడుతూ.. 'న్యాయానికీ, చట్టానికీ మధ్య తేడా ఉంటుంది. తన భర్త కేసులో భాగమైన సావిత్రి అనే న్యాయవాది కథే ఈ చిత్రం. ఆమె న్యాయం కోసం పోరాడుతుంటే, ఆమె సీనియర్‌కు మాత్రం చట్టమే ముఖ్యం. పరిస్థితుల కారణంగా ఆమె తన సీనియర్‌తోనే తలపడాల్సి వస్తుంది' అని తెలిపారు. 'హార్ట్ బీట్' ఫేమ్ చారుకేశ్ ఇందులో కీర్తి భర్తగా నటిస్తున్నారు. ఇక కీర్తి తదుపరి ఓ భారీ బ్జడెట్ రొమాంటిక్ థ్రిల్లర్ కోసం ప్రముఖ దర్శకుడితో చర్చలు జరుపుతున్నారని తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ భారీస్థాయిలో రూపొందనుందని, ఇప్పటివరకు చేయని జోనర్‌లో ఆమె కనిపించనున్నారని టాక్. అటు కీర్తి, రాజ్‌కుమార్ రావ్ జంటగా నటించిన 'రఫ్తార్' చిత్రం కూడా విడుదల కానుంది.





# నానీ మూవీలో రుక్మిణీ వసంత్

సప్త సాగరాలు దాటి', 'కాంతార 2' లాంటి విజయవంతమైన చిత్రాలతో దక్షిణాదిలోనే కాక ఉత్తరాదిలోనూ మంచి గుర్తింపు తెచ్చుకుంది నటి రుక్మిణీ వసంత్. ప్రస్తుతం ఆమె చేతుల్లో యశ్ 'టాక్సిక్', ఎన్టీఆర్ 'డ్రాగన్' లాంటి భారీ చిత్రాలున్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడామె తెలుగులో మరో కొత్త కబురు వినిపించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. కథానాయకుడు నాని సొంత నిర్మాణ సంస్థ వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై నిర్మించనున్న ఓ కొత్త చిత్రం కోసం ఆమెను నాయికగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. దీన్ని 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ తెరకెక్కించనున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన పూర్వ నిర్మాణ పనులు జరుగుతున్నాయని.. ప్రధాన నటుడు ఖరారు కాగానే ఈ సినిమాని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉదని సమాచారం.



అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# విద్యా, వైద్య రంగాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

## మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

### అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించిన గుత్తా, ఎంపీ చామల, ఎమ్మెల్యే వీరేశం

అక్షర కలం : చిట్యాల

రాష్ట్రంలో విద్యా, వైద్య రంగాలలో ప్రజలకు విస్తృతమైన సేవలను అందించడానికి ప్రభుత్వం కంకణబద్ధులై ఉందని తెలంగాణ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి స్పష్టం చేశారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో శనివారం ఆయన స్థానిక భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ?ఈ సందర్భంగా ఉరుమడ్లలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని ప్రారంభించడంతో పాటు, యువత విజ్ఞానార్జన కోసం మరమ్మతులు పూర్తి చేసిన గ్రంథాలయ భవనాన్ని వారు పరిశీలించారు. ?ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉరుమడ్ల గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తాము సంసిద్ధంగా ఉన్నామని భరోసా ఇచ్చారు. గ్రామంలో ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న వివిధ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయించి, త్వరలోనే రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా వాటిని ప్రారంభోత్సవం చేయిస్తామని ప్రకటించారు. ?గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో




అర్హులైన, నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తల్లిదండ్రులు సహకరించాలని, తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

--- ఉచిత కంటి శిబిరం ప్రారంభం...

గుత్తా సుఖేందర్ రెడ్డి తన స్వగృహంలో శంకర నేత్రాలయ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర చికిత్స శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.మానవ శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవం కళ్ళు అని, వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఉరుమడ్ల గ్రామ ప్రజల కోసం శంకర నేత్రాలయం వారు అన్ని రకాల అత్యాధునిక వసతులు, శస్త్రచికిత్స ఏర్పాట్లతో ఇక్కడికి వచ్చారని తెలిపారు. తొమ్మిది రోజుల పాటు నిరంతరాయంగా కొనసాగే ఈ ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామస్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ హాఫీస్ ఖాన్, మున్సిపల్ చైర్‌పర్సన్ పందిరి గీతా రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్ర వినోద మోహన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు పోకల దేవదాస్, వనమా వెంకటేశ్వర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చిట్యాల సమీపంలో లారీ క్లీనర్ మృతి



అక్షర కలం : చిట్యాల

నల్గొండ జిల్లా చిట్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని నేషనల్ హైవే 65 పక్కన ఉన్న '7 హోటల్' సమీపంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. చిట్యాల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడిని ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోకు చెందిన లారీ క్లీనర్ లకేంద్ర (33)గా గుర్తించారు. వారం రోజుల క్రితం పని కోసం బయలుదేరిన లకేంద్ర గత రెండు రోజులుగా కుటుంబ సభ్యులకు అందుబాటులోకి రాలేదు. దీంతో అతని కోసం వెతుకుతూ బుధవారం (26-06-2024) చిట్యాలకు వచ్చిన బంధువులకు, హోటల్ సమీపంలో లకేంద్ర మృతదేహం కనిపించింది. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న అతను, సరిగ్గా ఆహారం తీసుకోకపోవడం మరియు ఎండ తీవ్రతకు వడదెబ్బ తగలడం వల్లే మరణించి ఉంటాడని బంధువులు తెలిపారు. మృతిపై తమకు ఎలాంటి అనుమానాలు లేవని పేర్కొన్నారు. మృతుడి మేనబావ దిలీప్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిట్యాల ఎస్ఐ ఎం. రవికుమార్ తెలిపారు.

# సిసి రోడ్ల ప్రారంభం



అక్షరకలం బిబినగర్

బీబీనగర్ మండలం బట్టుగూడెం గ్రామ పరిధిలో రూ. 35 లక్షల హెచ్ఎండిఏ నిధులతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను భువనగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి పింగల్ రెడ్డి, పంజాల రామాంజనేయులు గౌడ్, పొట్టోళ్ల శ్యామ్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు సురకంటి సత్తి రెడ్డి, గోలి నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే పిఎసిఎస్ వైస్ చైర్మన్ గడ్డం బాలకృష్ణ గౌడ్, బీబీనగర్ సర్పంచ్ పంజాల శ్రీనివాస గౌడ్, గ్రామ సర్పంచ్, పాలక వర్గ సభ్యులు మరియు గ్రామ పెద్దలు తదితరులు ఈ శంకుస్థాపన మహోత్సవంలో పాల్గొన్నారు.

# ఆధునిక సాగు వైపు మర్రిచేట్టుతండా

## హైదరాబాద్ ఐఐఆర్ ఆర్ లో రైతులకు ఇన్-హౌస్ శిక్షణ

## గ్రామ రైతులంతా సద్వినియోగం చేసుకోవాలి

## జాతీయ ఉత్తమ మాజీ సర్పంచ్ శ్రీను నాయక్

అక్షరకలం దేవరకొండ



మర్రిచేట్టుతండా గ్రామ రైతుల వ్యవసాయ రంగాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు సరికొత్త శాస్త్రీయ పద్ధతులపై శిక్షణ ఇప్పించనున్నట్లు జాతీయ ఉత్తమ సర్పంచ్ అవార్డు గ్రహీత నేనావత్ శ్రీను నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని ఐసీఆర్ --భారతీయ వరి పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో 'నేరుగా విత్తే వరి సాగు పద్ధతులపై' నిర్వహించబోయే ప్రతిష్టాత్మక ఇన్-హౌస్ శిక్షణ కార్యక్రమానికి మర్రిచేట్టుతండా గ్రామ రైతులు హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ నేనావత్ శ్రీను నాయక్ మాట్లాడుతూ... మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలని, అప్పుడే వ్యవసాయం లాభసాటిగా మారుతుందని అన్నారు. ఇంతటి గొప్ప ఐసిఎఆర్ (ఐసీఆర్ ) సంస్థలో లభించే ఈ ఇన్-హౌస్ శిక్షణ మర్రిచేట్టుతండా రైతులకు ఒక గొప్ప వరమని కొనియాడారు. కావున గ్రామ రైతాంగం అంతా ఏకతాటిపైకి వచ్చి, ఈ శిక్షణ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని, ఆధునిక వరి సాగు పద్ధతులను నేర్చుకుని ఆర్థికంగా లాభపడాలని ఆయన పిలుపునిచ్చారు.

# పేదల పాలిట పెన్నిధి 'సీఎం సహాయనిధి'

అక్షరకలం బిబినగర్

బిబినగర్ మండలం గూడూరు గ్రామానికి చెందిన మంద ముత్తయ్య అత్యవసర శస్త్రచికిత్స నిమిత్తం మంజూరైన రూ. 2,50,000 సీఎం సహాయనిధి చెక్కును భువనగిరి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి లబ్ధిదారునికి అందజేశారు. ?ఈ కార్యక్రమంలో సర్పంచ్ బింగి అలివేలు మంగ శ్రీనివాస్, ఉప సర్పంచ్ జానా సత్యనారాయణ, గ్రామ శాఖ అధ్యక్షులు పాలకూరి శ్రీనివాస్ గౌడ్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు బద్ధం వాస్తవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆపద సమయంలో తమకు అండగా నిలిచిన సీఎం రేవంత్ రెడ్డి గారికి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి మరియు గూడూరు కాంగ్రెస్ నాయకులకు లబ్ధిదారుడు మంద ముత్తయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



# రైతులకు సకాలంలో ఎరువులు అందించాలి

## అధికారులతో ఎమ్మెల్యే బాలు నాయక్ సమీక్ష

అక్షరకలం దేవరకొండ



రాబోయే వానకాలం (ఖరీఫ్) సాగు సీజన్‌లో నియోజకవర్గంలోని రైతులకు యూరియా, కాంప్లెక్స్ ఎరువుల కొరత లేకుండా సకాలంలో అందించాలని దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్ అధికారులను ఆదేశించారు. శనివారం నియోజకవర్గ కేంద్రంలో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులతో ఎరువుల లభ్యత, నిల్వలు, సరఫరా వ్యవస్థపై ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ.. రైతాంగ సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే అవసరమైన ఎరువులను అన్ని మండల కేంద్రాల్లో సిద్ధంగా ఉంచాలని సూచించారు. అన్ని మండల కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పాక్స్ ), రైతు సేవా కేంద్రాలు, ప్రభుత్వ అనుమతి పొందిన డీలర్ల వద్ద ముందస్తు నిల్వలు ఉంచాలని స్పష్టం చేశారు. ఎరువులను అక్రమంగా నిల్వ ఉంచినా, కృత్రిమ కొరత సృష్టించినా లేదా ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఎక్కువ ధరలకు విక్రయించినా సహించేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వారి లైసెన్సులను రద్దు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎరువుల పంపిణీపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ, రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు, సహకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# గొల్లగూడెంలో వైభవంగా దుర్గమ్మ బోనాలు, మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠ

--- పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

అక్షరకలం బిబినగర్

బీబీనగర్ మండలం గొల్లగూడెం గ్రామ పరిధిలో శ్రీ దుర్గమ్మ తల్లి పండుగ, మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం, బోనాల పండుగ కార్యక్రమాలను గ్రామస్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే, అమ్మవారిని దర్శించుకుని ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు పలువురు ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

హాజరైన వారిలో:

?గోలి పింగల్ రెడ్డి (కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు)
?పంజాల రామంజనేయులు గౌడ్ (కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు) పొట్టోల్ల శ్యామ్ గౌడ్ (కాంగ్రెస్ పార్టీ నాయకులు) సురకంటి సత్తి రెడ్డి (కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు) గోలి నరేందర్ రెడ్డి (మాజీ ఎంపీటీసీ) పంజాల శ్రీనివాస గౌడ్ (బీబీనగర్ సర్పంచ్) ?పార్వతి మాధవి కుమార్ యాదవ్ (గ్రామ సర్పంచ్)
?యాస బాలకృష్ణ రెడ్డి (ఉపసర్పంచ్) ?ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో పండుగ వాతావరణం సంతరించుకుంది.





# రైతులకు గుడ్ న్యూస్

## --ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ను ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి



అక్షరకలం నల్గొండ

ఈ వానకాలం సీజన్లో రైతులు పంటలు సాగు చేసుకునేందుకు ఎలాంటి ఎరువుల కొరత లేకుండా అవసరమైన ఎరువులను సరఫరా చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. శనివారం అయన నల్గొండ లోని తన క్యాంప్ కార్యాలయం ఇందిర భవన్ లో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తో కలిసి "ఫర్టిలైజర్ బుకింగ్ యాప్" ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా ఎరువులకు సంబంధించిన సమస్త సమాచారాన్ని తెలుసుకోవచ్చని, ముఖ్యంగా ఎరువుల అందుబాటు, ప్రస్తుత పరిస్థితి, నిలువలు, సులభంగా తెలుసుకోవచ్చన్నారు. ప్రత్యకించి యూరియా అవసరమైన రైతులు ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా బుక్ చేసుకోవచ్చని, పట్టాదారు పాసుపుస్తకం, పంట వివరాలను నమోదు చేస్తే రైతు పేరు పైన యూరియాను సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఎకరాకు 2 బస్తాల చొప్పున ఇవ్వడం జరుగుతుందని, ఒక ఎకరా ఉన్నవారికి ఒకేసారి, 1 నుండి 5 ఎకరాలు ఆ పైన ఉన్న వారికి విడతలవారీగా యూరియాను సరఫరా చేయడం జరుగుతుందని, ఉదయం 6 నుండి రాత్రి 10 గంటల వరకు యూరియాను బుక్ చేసుకోవచ్చని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలలో సొసైటీలు, డిసిఎంఎస్ లు, 650 కేంద్రాలకు పైగా సరిపోను యూరియా ఉందని, ప్రతి రైతుకు యూరియా ఇవ్వడం జరుగుతుందని,ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. విద్యుత్తు అధికారులతో మంత్రి సమీక్షిస్తూ జిల్లాలో ఎలాంటి విద్యుత్ సమస్య రాకుండా చూసుకోవాలని అన్నారు. ముఖ్యంగా పట్టణాలతో పాటు, గ్రామాలలో సమస్య రాకూడదని, విరిగిన స్తంభాలను సరిచేయాలని, ఎక్కడైనా కొత్త ట్రాన్స్ఫార్మర్లు అవసరం ఉంటే తక్షణమే ప్రభుత్వం ద్వారా ఇప్పించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. లోవోల్టేజి సమస్య రాకూడదన్నారు. మున్సిపల్ అధికారులతో నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కు సంబంధించి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఈనెల 21న నిర్వహించనున్న యోగా దినోత్సవానికి సంబంధించిన టీషర్టులను ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, విద్యుత్ అధికారులు, జిల్లా వ్యవసాయ అధికారి వి. వినోద్ కుమార్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, తదితరులు ఉన్నారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# టెన్త్‌లో 95% మార్కులు వస్తే విమానంలో ఢిల్లీ టూర్

## విద్యార్థులకు మంత్రి కోమటిరెడ్డి బంపర్ ఆఫర్
## బొట్టుగూడ స్కూల్‌లో సర్ప్రైజ్ విజిట్
## ఆగస్టు కల్లా నియోజకవర్గంలో 40 'సూపర్ మోడల్' స్కూల్స్ సిద్ధం

ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం





నిజమైన అభివృద్ధి సిమెంట్ కట్టడాల్లో లేదు.. విద్యార్థుల భవిష్యత్తును మార్చే గుణాత్మక విద్యలోనే ఉందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని బొట్టుగూడ 'కోమటిరెడ్డి ప్రతీక్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల'తో పాటు జూనియర్, ఒకేషనల్ కళాశాలలను ఆయన సర్ప్రైజ్ విజిట్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో జోష్ నింపేలా ఆయన కీలక ప్రకటనలు చేశారు.?ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కార్పొరేట్ సంస్థలకు ధీటుగా రాణించాలన్నదే తన లక్ష్యమని మంత్రి అన్నారు. బొట్టుగూడ ప్రతీక్ స్కూల్‌లో ఈ ఏడాది పదో తరగతిలో 95 శాతం పైగా మార్కులు సాధించిన విద్యార్థులను తన సొంత ఖర్చులతో విమానంలో ఢిల్లీ టూర్‌కు తీసుకెళ్తామని బంపర్ ఆఫర్ ప్రకటించారు. గత ఏడాది తిప్పర్తి స్కూల్ విద్యార్థులను వైజాగ్, అరకు పంపించి స్టార్ హోటల్‌లో ఉంచిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. సాంకేతికతలో ప్రభుత్వ విద్యార్థులు వెనకబడకూడదనే ఉద్దేశంతో, రాబోయే నెల రోజుల్లోనే ప్రతీక్ పాఠశాలలో 1 నుండి 10వ తరగతి విద్యార్థుల కోసం సరికొత్త ా× (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ల్యాబ్‌ను ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. అలాగే 'హరే రామ హరే కృష్ణ' సంస్థ సహకారంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తామన్నారు. కాగా, ఈ స్కూల్‌లో విద్యార్థుల సంఖ్య 600 దాటడంతో ఇకపై అడ్మిషన్లు క్లోజ్ చేస్తున్నట్లు ప్రకటించారు.

### ఆగస్టు కల్లా 40 'సూపర్ మోడల్' స్కూల్స్...

నల్గొండ నియోజకవర్గ పరిధిలోని 30 నుండి 40 ప్రభుత్వ పాఠశాలలను పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసి, ఆగస్టు నాటికి తాగునీరు, అత్యాధునిక టాయిలెట్లు, డ్యూయల్ డెస్క్‌లు, కంప్యూటర్లతో కార్పొరేట్ స్థాయిలో మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్దుతామని మంత్రి హామీ ఇచ్చారు. జిల్లావ్యాప్తంగా టెన్త్‌లో 95శాతం సాధించిన పేద విద్యార్థులకు 'ప్రతీక్ ఫౌండేషన్' ద్వారా హయ్యర్ స్టడీస్ (ఇంటర్, ఐఐటీ, మెడిసిన్) కోచింగ్‌కు ఆర్థిక సాయం అందిస్తామన్నారు.

### సీట్ల సమస్యల పరిష్కారానికి హామీ...

మంత్రి ప్రతీక్ జూనియర్ కళాశాల (800 మంది విద్యార్థులు), ఒకేషనల్ కాలేజీ (900 మంది విద్యార్థులు) లలో తనిఖీలు చేపట్టారు. విద్యార్థుల సంఖ్య భారీగా పెరగడంతో గదుల కొరత వేధిస్తోందని ప్రిన్సిపాల్స్ మంత్రి దృష్టికి తీసుకురాగా, వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. ఉపాధ్యాయులు విద్యార్థులను తమ సొంత పిల్లల్లా భావించి చదివించాలి. ప్రత్యేక క్లాసులు తీసుకుని ఐఏఎస్, ఐపీఎస్, ఐఐటీలే లక్ష్యంగా వారిని తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, ప్రిన్సిపాల్స్ రాజేందర్, ఉపేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని కలిసిన శంకర్ నాయక్

అక్షర కలం, చౌటుప్పల్



యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ బంజారా సేవాలాల్ చౌటుప్పల్ మండల అధ్యక్షులు శంకర్ నాయక్ ఆధ్వర్యంలో మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో బంజారా కమ్యూనిటీ హాల్ నిర్మాణం కొరకు స్థలాన్ని కేటాయించాలని వినతి చిత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ నారాయణపురం, నాంపల్లి,మర్రిగూడెం,తదితర ప్రాంతాలకు చెందిన బంజారా ప్రజలు నిత్యం హైదరాబాదు, చౌటుప్పల్లో తమ జీవనోపాధిలో భాగంగా తిరుగుతూ ఉంటారు.చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో బంజారా కమ్యూనిటీ భవనాన్ని నిర్మించినట్లయితే వారి కి ఎంతో మేలుగా ఉంటుందని అన్నారు.అదేవిధంగా బంజారా ప్రజల అత్యంత ప్రధానమైన పండుగ తీజ్ వైభవంగా జరుపుకుంటారు.పండుగ జరుపుకోవడానికి గాను భవనం చాలా ఉపయోగపడుతుందని అన్నారు.ఈ విన్నపాన్ని విన్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సానుకూలంగా స్పందించారని చేశారు.ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు గుగులోతు అరుణా శంకర్ నాయక్,కమిటీ ప్రధాన కార్యదర్శి స్వామి నాయక్,కరంటోత్ రవి నాయక్,కార్యవర్గం సోను నాయక్,రవి నాయక్,కొర్ర లింగ నాయక్,సీతా నాయక్,బంజారా నాయకులు,తదితరులు,పాల్గొన్నారు.

# 16వ వార్డులో ఘనంగా మంత్రి ఉత్తమ్ జన్మదిన వేడుకలు



అక్షరకలం కోదాడ

భారీ నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలను 16వ వార్డులో ఘనంగా నిర్వహించారు. స్థానిక కౌన్సిలర్ ఏజాజ్ ఆధ్వర్యంలో వార్డు ప్రజలందరూ కలిసి కేక్ కట్ చేసి మంత్రి ఉత్తమ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కోదాడ, హుజూర్నగర్ రెండు నియోజకవర్గాలను వేల కోట్ల నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పదంలో నడిపిస్తున్న తమ అభిమాన నాయకుడు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇటువంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నతమైన పదవులు అధిరోహించి ప్రజలకు మరింత కాలం వారు సేవలు అందించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ బుడిగం నాని, జహీర్ ఖాన్, కాజా భాయ్, రహీం, దాదావాలి, చోటు, బబ్లు, ఈశాక్ తదితరులు పాల్గొన్నారు...

# శామీర్ పేట్ వరకు రాజీవ్ రహదారి విస్తరణ పనుల వేగం



మేడ్చల్, అక్షరకలం ప్రతినిధి:

సికింద్రాబాదు నుండి శామీర్ పేట్ వరకు రాజీవ్ రహదారి విస్తరణ పనులు శరవేగంగా జయగుతున్నాయి. అందులో భాగంగా తూంకుంటలోని భూ నిర్వాసితులకు గతంలోనే నష్ట పరహారం అందించగా, వారు కోరిన విధంగా మూడు నెలల గడువు అనంతరం ఎస్డిసిఎల్ వారు తూంకుంటలో సేకరించిన స్థలాన్ని పంచనామ చేసి జూన్ 6వ తేదిన హెచ్ఎండిఏ అధికారులకు అప్పగించారు. శనివారం ఎస్డిసిఎల్ మాలతి ఆధ్వర్యంలో హెచ్ఎండిఏ అధికారులు అక్కడ ఉన్న నిర్మాణాల కూల్చివేతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్వే ల్యాండ్ సర్వేయర్ వినయ్ కుమార్, ఆర్ఐ రాఘవ, హెచ్ఎండిఏ ఎఈ సంపత్ అధికారులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

### ఆర్పిఐ (అథవాలే) రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగపిండి రమేష్
### ఆర్పిఐ జిల్లా నూతన అధ్యక్షుడిగా దూడం తిరుపతి

మందమర్రి, జూన్ 20 అక్షర కలం:



జిల్లాలో ఆర్పిఐ (అథవాలే) పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క పార్టీ కార్యకర్త తమ శక్తి మేరకు పనిచేసి, పార్టీని ముందుకు తీసుకువెళ్లాలని, ఆర్పిఐ (అథవాలే) పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగపిండి రమేష్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ఆర్పిఐ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికి, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో పార్టీ జిల్లా పాత కమిటీని పూర్తిగా రద్దుచేసి, జిల్లా నూతన కార్యవర్గాన్ని నియమిస్తూ, ఆర్పిఐ (అథవాలే) పార్టీ జిల్లా నూతన అధ్యక్షుడిగా దూడం తిరుపతిని నియమిస్తూ, ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తుంగపిండి రమేష్ మాట్లాడుతూ, జిల్లాలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యలపై నిరంతరం ప్రజల పక్షాన నిలబడి, పోరాటం చేయాలని సూచించారు. అనంతరం తిరుపతి మాట్లాడుతూ, తనపై నమ్మకంతో అప్పగించిన పదవీ బాధ్యతలను దుర్వినియోగం చేయకుండా, పార్టీ కోసం కష్టపడి పనిచేస్తానని తెలిపారు.

# నల్గొండ వేదికగా రోడ్ల విప్లవం

### ---చరిత్రలో నిలిచిపోయేలా 'హ్యాం' రోడ్ల పైలాన్
### ---మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
### -- సీఎం రేవంత్ సభతో నల్గొండకు కొత్త కళ
### -- సభా ప్రాంగణంలో సౌకర్యాలపై అధికారులకు కీలక ఆదేశాలు

ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం



నల్గొండ జిల్లా, కనగల్ మండల కేంద్ర లోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ సమీపంలో త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించనున్న హ్యాం రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్న దృష్ట్యా శనివారం రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హ్యాం రోడ్ల శంకుస్థాపన పైలాన్ పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని ఆయన ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. శనివారం మంత్రి కనగల్ వ్యవసాయ మార్కెట్ సమీపంలో హ్యాం రోడ్ల శంకుస్థాపనకై నిర్మిస్తున్న పైలాన్ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పైలాన్ పనులను పరిశీలించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ 13500 కోట్లకు సంబంధించిన పైలాన్ ఎప్పుడు గుర్తుండిపోయేలా నిర్మించాలని, ముఖ్యంగా పైలాన్ చుట్టూ కిందివైపున మూడు రంగుల కలర్ వేయించాలని, అలాగే పెద్ద అక్షరాలతో రోడ్లు, భవనాల శాఖ పేరు అగుపించేలా రాయించాలని, రైలింగ్ తో పాటు, పైలాన్ చుట్టూ అందంగా తీర్చిదిద్దాలని, సాయంత్రం సమయాల్లో గ్రామస్తులు, ప్రజలు పైలాన్ వద్ద గడిపే విధంగా పచ్చ గడ్డి తో తీర్చిదిద్దాలని మంత్రి ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. అంతకుముందు మంత్రి ఎన్జి కళాశాల మైదానంలో రాష్ట్ర ముఖ్యమంత్రి బహిరంగ సభ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. బహిరంగ సభకు హాజరయ్యే ప్రజలు, ఏర్పాటు చేయాల్సిన కుర్చీలు, టెంట్లు, ఎల్ఈడి స్క్రీన్లు, పార్కింగ్ ఇతర ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్లతో చర్చించారు. అంతేకాక ఆ రోజు పట్టణంలో ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని, బహిరంగ సభకు హాజరయ్యే వారికి అవసరమైన ఏర్పాట్లను చేయాలని అధికారులు ఆదేశించారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవర్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఈ శ్రీధర్ రెడ్డి, డిఈ గణేష్, ఇరిగేషన్ సిఈ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి గుమ్మల మోహన్ రెడ్డి, తదితరులు మంత్రి వెంట ఉన్నారు.

# డిసెంబర్ లోగా సాగునీటి ప్రాజెక్టులు పూర్తి కావాలి

## కమిషనర్ శివకుమార్ నాయుడు

అక్షరకలం నల్గొండ



నల్గొండ జిల్లాలో కొనసాగుతున్న ఇరిగేషన్ ప్రాజెక్టుల భూసేకరణ, అవార్డుల ఆమోదం, పునరావాసం (ఆర్ ఎన్ ఆర్), నిర్మాణ పనులను వేగవంతం చేసి డిసెంబర్ నాటికి అన్ని పనులు పూర్తి చేయాలని ఆర్అండ్ఆర్, ల్యాండ్ అక్విజిషన్ అండ్ ఇరిగేషన్ కమిషనర్ కే. శివకుమార్ నాయుడు అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు, ఇంజనీర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రాజెక్టుల వారీగా పురోగతిని సమీక్షించారు. ఉదయ సముద్రం లిఫ్ట్ ఇరిగేషన్, గుమ్మలబావి, పోతినేనిపల్లి, నెమ్మాని, డిండి ఇరిగేషన్ ప్రాజెక్టు, గొట్టిముక్కల, సింగరాజుపల్లి, చింతపల్లి రిజర్వాయర్, కృష్ణంపల్లి, శివన్నగూడెం--చింతపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, దున్నపోతులగూడెం బత్తుల పాలెం, డిండి మెయిన్ కెనాల్, అంబాభవాని, కంబాలపల్లి, పొగిళ్ల పెద్దగట్టు, ఐటిపాముల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. భూసేకరణ పూర్తయిన ప్రాంతాల్లో అవార్డులు పాస్ అయినందున ఇకపై ఎలాంటి జాప్యం లేకుండా పనులు పూర్తి చేయాలని చెప్పారు. ఆర్అండ్ఆర్ కాలనీల కై భూసేకరణ పూర్తయిన చోట లే-అవుట్లు రూపొందించి, మౌలిక వసతుల అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని అన్నారు. ముంపునకు గురైన గ్రామాల ప్రజలకు గ్రామాల వారీగా పునరావాసం కల్పించి, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. ప్రభుత్వం అవసరమైన బడ్జెట్‌ను కేటాయించిన నేపథ్యంలో భూసేకరణ, పునరావాసం, నిర్మాణ పనులను సమన్వయంతో వేగవంతం చేసి డిసెంబర్ నాటికి అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. భూ సేకరణ పనులు తొందరగా పూర్తి చేసినందుకు జిల్లా కలెక్టర్ ని అభినందించారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి దశరథ్, సిఈ గగనం శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనింగ్) శ్రీకాంత్ రెడ్డి, భూసేకరణ స్పెషల్ కలెక్టర్ మాధురి, జిల్లా అధికారులు, ఇంజనీర్లు, తదితరులు పాల్గొన్నారు.



## నీట్ (యూజీ)--2026 పరీక్ష

### అభ్యర్థులు మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలి.....

### – జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్...

**మెదక్ /కొల్చారం జూన్20(అక్షర కలం):-**

జిల్లాలో ఈ నెల 21న (ఆదివారం) మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.15 గంటల వరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెదక్ లో నిర్వహించనున్న నీట్ (యూజీ)--2026 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు.



– అభ్యర్థులు వెంట తీసుకురావాల్సినవి...

ఎన్‌టిఏ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న అడ్మిట్ కార్డు...

ఆధార్ కార్డు / పాన్ కార్డు / పాస్‌పోర్ట్ / స్టూడెంట్ ఐడీ వంటి ఒరిజినల్ ఫోటో గుర్తింపు కార్డు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఒక పోస్ట్‌కార్డ్ సైజ్ ఫోటో, పారదర్శక (ట్రాన్స్‌పరెంట్) నీటి బాటిల్ మాత్రమే.

– పాటించాల్సిన సూచనలు... (డిఓ ఎస్ )...

అడ్మిట్ కార్డులో పేర్కొన్న గేట్ క్లోజింగ్ సమయం (మధ్యాహ్నం 1.30 గంటలు) కంటే ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి.

ఇన్విజిలేటర్ సమక్షంలో ఓఎంఆర్ షీట్, హాజరు పట్టికపై సంతకాలు చేయాలి. పరీక్షా కేంద్రంలో ఎన్‌టిఏ అందించే బ్లాక్ బాల్ పాయింట్ పెన్ మాత్రమే ఉపయోగించాలి

– నిషేధిత వస్తువులు... ( డి ఓ ఎన్ టి ఎస్)....

స్వంత పెన్నులు, పెన్సిల్లు, రబ్బర్లు తీసుకురావద్దు ఓఎంఆర్ షీట్‌పై అనవసర గుర్తులు చేయరాదు,అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి రుమాలు, మొబైల్ ఫోన్, ఏ రకమైన గడియారం , బెల్ట్, ఆభరణాలు (ఉంగరాలు, గొలుసులు, చెవిపోగులు మొదలైనవి), ఎలక్ట్రానిక్ లేదా కమ్యూనికేషన్ పరికరాలు, పెన్సిల్, రబ్బరు, షార్పనర్, కరెక్షన్ ఫ్లూయిడ్ వంటి వస్తువులను తీసుకురావద్దు.పై పేర్కొన్న వస్తువులలో ఏదైనా అభ్యర్థి వద్ద ఉన్నట్లు గుర్తిస్తే, అతడిని/ఆమెను పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు.పరీక్షా గదిలో మొబైల్ ఫోన్ లేదా ఇతర నిషేధిత వస్తువులు కలిగి ఉన్నట్లు తేలితే, అది తీవ్రమైన నిబంధనల ఉల్లంఘనగా పరిగణించబడుతుంది. అలాంటి సందర్భంలో అభ్యర్థి అభ్యర్థిత్వం (కాండిడేటర్ ) రద్దు చేయబడటంతో పాటు, భవిష్యత్తులో నిర్వహించే పరీక్షలకు కూడా అనర్హుడిగా ప్రకటించబడతారు.అభ్యర్థులు తమ పరీక్షా కేంద్రం చిరునామాను ముందుగానే ధృవీకరించుకుని, పరీక్షా రోజున సమయానికి కేంద్రానికి చేరుకునేలా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. నీట్ (యూజీ)--2026 పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు తల్లిదండ్రులు, అభ్యర్థులు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

## చిత్తనూరు గ్రామంలోబండ రామ్ రెడ్డి కి ఘన నివాళులు....:



**(అక్షర కలం,నారాయణపేట జిల్లా జూన్ 20 ),**

నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల పరిధిలోని చిత్తనూరు గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బండ రామ్ రెడ్డికి శనివారం నాడు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో పాటు బంధుమిత్రులు నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిత్తనూరు చుట్టుపక్కల గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ నిర్మూలనకు ప్రత్యేక తనిఖీలు:మరికల్ ఎస్ఐ విక్రం.

**(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, జూన్,20)**

జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు మరికల్: మరికల్ పట్టణంలో డ్రగ్స్, మత్తు పదార్థాల నిర్మూలన కోసం ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం జరిగింది అని మరికల్ ఎస్ఐ విక్రం తెలిపారు.ఈ సందర్భంగా మరికల్ పట్టణ కేంద్రంలో ఈగల్ ఫోర్స్ టీంతో కలిసి నార్కోటిక్స్ స్నైపర్ పోలీసు జాగిలంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు. బస్ స్టాండ్ పరిసర ప్రాంతాలు, పాన్ షాపులు, కిరణం షాపు లలో అనుమానాస్పద ప్రదేశాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టామని తెలిపారు.మత్తు పదార్థాల రవాణా, నిల్వ, విక్రయాలు వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు జిల్లా పోలీసులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారని ఎస్ఐ పేర్కొన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు సమాజాన్ని నాశనం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రజలు ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు




పదార్థాలను వినియోగిస్తున్నా, విక్రయిస్తున్నా, రవాణా చేస్తున్నా వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1908 లేదా డయల్-100కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.ఈ తనిఖీల్లో నార్కోటిక్స్ స్నైపర్ డాగ్ రుద్ర, డాగ్ హ్యాండ్లర్ పీసీ రవి, కానిస్టేబుల్ శ్రీధర్, ఈగల్ ఫోర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలుంటే సంకోచించవద్దు.....- నేరుగా తెలియజేయండి....

**– యూనిఫామ్‌కు గౌరవం తీసుకొచ్చేలా విధులు నిర్వహించాలి...**

**– పోలీసు సిబ్బంది క్రమశిక్షణ, సంక్షేమంపై అదనపు ఎస్పీ ప్రత్యేక సూచనలు....**

**– పరేడ్ ద్వారా క్రమశిక్షణ, సమయపాలన, ఐక్యత పెంపొందుతుంది....**

**– అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్.....**

**మెదక్ /కొల్చారం జూన్ 20(అక్షర కలం):-**

మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం వారాంత పరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ హాజరై గౌరవ వందనం స్వీకరించారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు శాఖలో హైరార్కీ వ్యవస్థకు ఎంతో ప్రాధాన్యం ఉంటుందని, అధికారులు ఇచ్చే ఆదేశాలను ప్రతి పోలీసు సిబ్బంది విధిగా పాటించాలని సూచించారు. విధి నిర్వహణలో కొన్నిసార్లు 10 నుంచి 12 గంటలపాటు



పనిచేయాల్సి వస్తుందని, అలాంటి పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు పరేడ్ ద్వారా శారీరక, మానసిక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందన్నారు.యూనిఫామ్ అంటే కేవలం దుస్తులు మాత్రమే కాదని, అది పోలీసు శాఖలోని యూనిఫార్మిటీ, క్రమశిక్షణ, ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి పోలీసు సిబ్బంది యూనిఫామ్‌కు ఉన్న గౌరవాన్ని నిలబెట్టేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.ఇటీవల రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మహిపాల్ మృతి చెందడం అత్యంత బాధాకరమని పేర్కొంటూ, ఆయన లేని లోటును వారి కుటుంబానికి ఎవరూ భర్తీ చేయలేరన్నారు. ఇలాంటి అనుకోని పరిస్థితుల్లో కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే ఉద్దేశంతో ప్రతి పోలీసు ఉద్యోగి శాలరీ ప్యాకేజీ సౌకర్యం కలిగిన బ్యాంకు ఖాతాను కలిగి ఉండేలా చూసుకోవాలని సూచించారు.

అదేవిధంగా హోంగార్డు సిబ్బంది కూడా హెచ్‌డీఎఫ్‌సీ ( హెచ్ డి ఎఫ్ సి ), యాక్సిస్ (అక్సిస్ ) బ్యాంకులు అందిస్తున్న శాలరీ ప్యాకేజీల్లో తమ ఖాతాలను మార్చుకోవాలని సూచించారు. ఈ ప్యాకేజీల ద్వారా లభించే ప్రమాద బీమా వంటి ప్రయోజనాలు అనుకోని ప్రమాదాల సమయంలో కుటుంబ సభ్యులకు ఆర్థిక ఆసరాగా నిలుస్తాయనితెలిపారు.అదనపు ఎస్పీ పోలీసు సిబ్బందికి ఆన్‌లైన్ బెట్టింగ్, జూదం వంటి వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లో మొదట కొంత లాభం వచ్చినట్లు చూపించి ఆకర్షిస్తారని, అనంతరం భారీ మొత్తంలో ఆర్థిక నష్టాలు ఎదురై తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయని హెచ్చరించారు. ఇలాంటి పరిస్థితుల కారణంగా కొందరు తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్య వంటి దురదృష్టకర నిర్ణయాలకు కూడా పాల్పడే పరిస్థితులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. అందువల్ల ఎట్టి పరిస్థితుల్లోనూ ఆన్‌లైన్ బెట్టింగ్‌కు దూరంగా ఉండి, బాధ్యతాయుతమైన ఆర్థిక క్రమశిక్షణను పాటించాలని సూచించారు.అలాగే, విధి నిర్వహణలో గానీ, వ్యక్తిగతంగా గానీ ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చి నేరుగా తెలియజేయాలని అదనపు ఎస్పీ సూచించారు. సిబ్బంది సంక్షేమానికి జిల్లా పోలీసు యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఈ పరేడ్‌లో డియస్పి ప్రసన్న కుమార్, ఆర్ఐ లు శైలందర్, రామకృష్ణ, ఎస్సై లు సిబ్బంది పాల్గొన్నారు.

## హామీలతో రైతులను నట్టేట ముంచిన కాంగ్రెస్

### హామీలకు తక్కువ ఆర్భాటాలకు ఎక్కువ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.

### పెద్ద జీతగాడు విదేశీ పర్యటన మోజుగా పెట్టుకున్న ముఖ్యమంత్రి

**వనపర్తి జూన్ 20 ప్రతినిధి అక్షర కలం వై రమేష్**

మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి స్వగృహంలో బి.ఆర్.ఎస్ నాయకులు పత్రికా సమావేశంలో మాట్లాడారు.ఈ సమావేశములో గట్టు యాదవ్ మాజీ జిల్లా అధ్యక్షులు,వాకిటి.శ్రీధర్ అధికార ప్రతినిధి,కృష్ణా నాయక్ మాజీ ఎం.పి.పి మాట్లాడుతూ రైతు ద్రోహిగా రేవంత్ రెడ్డి చరిత్రకు ఎక్కారని రైతు వ్యతిరేఖ విధానాలపై వారు మాట్లాడారు.వాకిటి.శ్రీధర్ మాట్లాడుతూనాలుగు సార్లు రైతు భరోసా ఎగవేత,మొత్తం సన్నాలకు బోనస్ అని చెప్పి విడతల వారిగా ఎగవేత ధాన్యం కొనుగోలులో విఫలం,సాగు తాగు నీళ్లకు కె.సి.ఆర్ ప్రత్యేక దృష్టి,పాలమూరు రంగారెడ్డి కోసం కేవలం 1000కోట్లు ఖర్చుపెట్టలేని దుస్థితిలో కాంగ్రెస్,కృష్ణా నాయక్ మాజీ ఎం.పి.పి.మాట్లాడుతూహ(రాజు పాటలాగా హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్.హామీలు ఎగ్గొటిన కాంగ్రెస్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి.సీజన్ ప్రారంభంలో కూడా రైతు భరోసా ఇవ్వలేదు.ధాన్యం కొనుగోలు నెపం కేంద్రం పై నెట్టివేసి రేవంత్ రెడ్డి చేతులు దులుపుకున్నారు. పెద్ద జీతగాడు విదేశీ పర్యటన మోజుగా పెట్టుకున్నాడు.తడిసిన ధాన్యాన్ని కొనుగోలు



విషయములో ఒక్కనాడైనా ఎం.ఎల్.ఏ సమీక్ష చేయలేదు.యూరియా కష్టాలు శాశ్వతం అయినాయి. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు గ్రామాలలో తిరిగితే గుడ్డలు ఊడదీస్తారు.గట్టు యాదవ్ మాట్లాడుతూరైతులను రేవంత్ వెన్నుపోటు పొడిచారు.కె.సి.ఆర్ ని మించి సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్న హామీలు నిలబెట్టుకోవాలి. అన్నపూర్ణ పేరు గాంచిన రాష్ట్రాన్ని ఆగం చేశారు. నీళ్లు నిధులు నియామకాలు కోసం పదవులు త్యాగం చేసి పోరాటం చేసిన కె.సి.ఆర్. వారు అన్నారు.వ్యవసాయాన్ని సస్యశామలం చేసి ఒక పరిశ్రమ చెందిన చేసిన కె.సి.ఆర్,11విడతలుగా 72లక్షల కోట్లు రైతు బంధు ఇచ్చి దేశాన్నికి కె.సి.ఆర్ ఆదర్శంగా నిలిపారు.రైతు ద్రోహి రేవంత్, రైతు భరోసా రైతు బీమా,రైతు రుణ మాఫీ ఎగ్గొట్టి యూరియా కూడా సరఫరా చేయకుండా రైతులకు ద్రోహం చేసిన రేవంత్,యూరియా సరఫరా లేకున్న రైతు భరోసా లేకున్నా ఆరుగాలం శ్రమించి పంటలు పండించినా ధాన్యం కొనుగోలు చేయడంలో విఫలం,కాళేశ్వరం ప్రాజెక్టు మీద గోష్ కమిటీ వేసి గొంగడంత కూడా ఆరోపణలు నిరూపించలేకపోయారు.

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును పడవ్ పెట్టిన పాలమూరు బిడ్డ రేవంత్. కె.సి.ఆర్ 2 కోట్ల 30లక్షల ఎకరాల విస్తీర్ణంలో సాగు అందుబాటులోకి తెచ్చారు.

7వేల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి చివరి గింజతో సహా కొనుగోలు కె.సి.ఆర్ ఇచ్చారు. దాచుకో,దోచుకో విధానాన్ని కాంగ్రెస్ నాయకులు అనుసరిస్తూ ప్రజల రక్తాన్ని పీలుస్తున్న జలగలుగా తయారు అయినారు. కేంద్రంతో పని లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్. ఆరు గ్యారంటీలు 11డిక్లరేషన్లు 420హామీలు మహిళలకు 2500,కళ్యాణ లక్ష్మీతో పాటు తులం బంగారం, నిరుద్యోగులకు 2లక్షల ఉద్యోగాలు,నిరుద్యోగ భృతి విద్యార్థినులకు స్కూటీలు విద్యా బరోసా,కె.సి.ఆర్ కిట్టు, గ్యాస్ సబ్సిడీ,రైతు భరోసా రైతు బీమా,రైతు రుణ మాఫీ, యూరియా సరఫరా,ధాన్యం కొనుగోలు హామీలు నిలబెట్టుకునే వరకు బి.ఆర్.ఎస్ ఉద్యమం చేపడుతుంది. ఈ సమావేశములో బోలెమోని లక్ష్మయ్య, నందిమల్ల.అశోక్,గంధం.పరంజ్యోతి, మండల పార్టీ అధ్యక్షులు రాళ్ళ కృష్ణయ్య కె.మాణిక్యం,రఘువర్ధన్ రెడ్డి, వేణు గోపాల్,గులాం ఖాదర్ ఖాన్,నాగన్న యాదవ్,వెంకట్ సాగర్,సూర్యవంశం.గిరి చిట్యాల.రాము, జోహెబ్ హుస్సేన్,నీలస్వామి,ఎర్ర.శ్రీనివాసులు,బొబ్బిలి.ప్రేమ్ కుమార్,చంద్రశేఖర్, లక్ష్మీకాంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## నాభిశీల బొడ్రాయి ద్వితీయ వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వంగ రాజేశ్వర్ రెడ్డి

**అక్షర కలం సిద్దిపేట జూన్ 20:**

నారాయణరావుపేట మండలం బంజేరుపల్లె గ్రామంలో ఘనంగా నిర్వహించిన శ్రీ శ్రీ శ్రీ నాభిశీల బొడ్రాయి ద్వితీయ వార్షికోత్సవ మహోత్సవంలో వంగ రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొని గ్రామదేవతల ఆశీస్సులు పొందారు.ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారంగా వంగ రాజేశ్వర్ రెడ్డి రూ.10,000/- నగదు విరాళాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వంగ రాజేశ్వర్ రెడ్డి కి గ్రామ ప్రజలు, యువకులు, పెద్దలు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.గ్రామ ప్రజలకు వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, గ్రామదేవతల కృపాకటాక్షాలు ప్రతి కుటుంబంపై ఉండాలని ఆకాంక్షించారు.అలాగే గ్రామదేవతల ఆశీస్సులతో సిద్దిపేట నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకున్నారు.



ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నీట్ (యూజీ)--2026 పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

### అభ్యర్థులు మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలి : జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి ప్రతినిధి,అక్షరకలం..**

జిల్లాలో ఈ నెల 21న (ఆదివారం) మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.15 గంటల వరకు నిర్వహించనున్న నీట్ (యూజీ)--2026 పరీక్షను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు.జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన 9 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 2,924 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని ఆయన వెల్లడించారు. పరీక్షా నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు.ఈ సందర్భంగా పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు.



Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955